
ఆంధ్రజ్యోతి



ముగిసిన ఎన్నికల కోడ్

నెల్లూరు (హరనాథపురం) : సార్వత్రిక ఎన్నికల ఘట్టం ముగియడంతో గురువారం సాయంత్రం కోడ్ ముగిసినట్టు కలెక్టర్ హరినారాయణన్ ప్రకటించారు. మార్చి 16న జిల్లాలో కోడ్ అమలులోకి వచ్చిందని, 82 రోజులపాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేసినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వివిధ బృందాలను నియమించి ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పర్యవేక్షించినట్లు తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తయినట్లు తెలిపారు.

నాటికన్నా నేడు ఘనం!

- భారీగా పెరిగిన కూటమి ఓట్ల షేరింగ్
- 2014లో 44.1 శాతం.. ఇప్పుడు 55.54 శాతం
- వైసీపీకి అప్పట్లో 48.9, ఇప్పుడు 39.91 శాతం
- అవినీతి, అరాచకం, అధిక ధరల కారణంగా కొట్టుకుపోయిన సంక్షేమం
- రాష్ట్రం బాగు కోసం కూటమికి జై కొట్టిన జనం

సంవత్సరం	పోలైనవి	కూటమి	వైసీపీ
2014	17,10,292	7,51,844	8,32,991
2024	15,74,029	8,72,838	6,28,295

2014 ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి పోటీ చేసింది. రాష్ట్రంలో తెలుగు దేశం అధికారంలోకి వచ్చింది. 2024లోనూ ఈ మూడు పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయి. విజయదుందుభి మోగించాయి. తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. ఈ రెండు ఎన్నికల మధ్య ఓట్ల షేరింగ్‌లో మాత్రం భారీ తేడా కనిపిస్తోంది. గతానికి, ఇప్పటికి కూటమి ఓట్ల శాతం భారీగా పెరిగింది. వైసీపీకి ఓట్లు మాత్రం తగ్గిపోయాయి. కూటమి ఓటు షేరింగ్ పెరగడానికి వైసీపీ షేరింగ్ తగ్గడానికి ప్రధాన కారణం ఐదేళ్ల వైసీపీ పాలనలో వైఫల్యాలే అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



నెల్లూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : 2014లో తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చింది. కానీ జిల్లాలో వైసీపీకే ఎక్కువ ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో పోల్ అయిన ప్రతి వంద ఓట్లలో వైసీపీకి 48.9 శాతం ఓట్లు వచ్చాయి. అంటే దాదాపుగా 50 శాతం ఓట్లు వైసీపీకే పడ్డాయి. కానీ ప్రస్తుత ఎన్నికల్లో అధికార పార్టీ హోదాలో ఉండి పోటీ చేసిన వైసీపీకి కేవలం 39.91 శాతం ఓట్లు మాత్రమే పడ్డాయి. అంటే 9 శాతం ఓట్లు తగ్గాయి. ఊహకందని రీతిలో ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని తిరస్కరించారు. దీనికి ప్రధాన కారణాల్లో అవినీతి మొదటిదనే వాదన వినిపిస్తోంది. 2019 ఎన్నికల్లో జగన్ అనూహ్య విజయం సాధించిన క్రమంలో అవినీతిని ప్రజలు అంగీకరించారనే వాదన బలంగా వినిపించింది. అయితే ప్రస్తుత ఎన్నికల ఫలితాలలో అది తప్పని తేలిపోయింది. ప్రజలు అవినీతిని సహించరనే నిజం స్పష్టమయ్యింది.

● ఎన్నెన్నో ఆరోపణలు

2019 ఎన్నికలకు పూర్వం జగన్ మీద వచ్చిన అవినీతి ఆరోపణలు కాగితాలు, లెక్కలు, నివేదికలు, సీబీఐ, ఈడీ కార్యాలయాల వరకే పరిమితం అయ్యింది. ఇది ప్రజలకు పెద్దగా అర్థం కాలేదు. ఆ కారణంగానే ప్రజలు జగన్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలను విశ్వసించలేదు. పైగా వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణం తాలూకు సానుభూతి అవినీతి ఆరోపణల ప్రభావాన్ని తగ్గించింది. అయితే ఈ ఎన్నికల్లో జగన్ అవినీతికి పాల్పడుతున్నాడని ప్రతిపక్ష పార్టీలు చేసిన ఆరోపణలను ప్రజలు నమ్మారు. నాశిరకం మద్యం అమ్మకాల ద్వారా రూ.వేల కోట్లు వెనకేసుకోవం, ఇసుక అమ్మకాల్లో జగన్ దోచుకొంటున్నాడనే ఆరోపణలను నమ్మారు. దీనికితోడు స్థానిక నాయకుల అవినీతి ప్రజల కళ్లకు కట్టినట్లు కనిపించింది. ఇసుక, క్వారీలు, సిలికా, భూ ఆక్రమణలు, మామూళ్లు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు వీటన్నింటిని ప్రజలు ప్రత్యక్షంగా చూశారు. కరెంటు బిల్లులు చూసి గుండెలు బాదుకున్నారు. ఉద్యోగాలు లేక చేతికందిన బిడ్డలు వీధులమ్మడి తిరగడం చూశారు. వీటన్నింటికి మించి ఐదేళ్ల పాటు ఏదో తెలియని అభద్రత భావంతో గడిపారు. ఇవన్నీ జగన్ సంక్షేమ పథకాలను మింగేశాయి. నవరత్నాలు జగన్ ఇంటి నుంచి ఇవ్వడం లేదు కదా అనే అభిప్రాయాన్ని కలిగించాయి. మచ్చుకైనా కనిపించని అభివృద్ధి, జీతాల కోసం ఉద్యోగులు, పింఛన్ల కోసం విశ్రాంత ఉద్యోగులు అనుభవించే నరకయాతన ఇవన్నీ ప్రజల్లో రాష్ట్ర కాంక్షను రగిలించాయి. సంక్షేమ పథకాల కింద డబ్బులు తీసుకొంటున్న వారు సైతం రాష్ట్రం నాశనం అయిపోతుందబ్బా అనే మాటే అన్నారు. ఈ కారణాలు వైసీపీ ఓట్ల శాతానికి భారీగా తగ్గించేశాయి.

● రాష్ట్రం బాగుపడాలనే కాంక్ష

ఆసియా ఖండ వాసులకు పుట్టిన గడ్డ మీద, దేశం మీద ప్రేమాభిమానాలు ఎక్కువని చరిత్రకారులు అంటారు. 2014, 2024 ఎన్నికల ఫలితాలను గమనిస్తే ఇక్కడి ప్రజలకు కూడా రాష్ట్రం మీద మమకారం ఎక్కువ అనే చెప్పక తప్పదు. రాష్ట్రం విడిపోయిన తరువాత జరిగిన తొలి ఎన్నికల 2014లో కూడా ప్రజలు రాష్ట్రం మీద మమకారం ప్రదర్శించారు. హైదరాబాద్‌ను కోల్పోయిన రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు సీఎం కావాలని అనుకున్నారు. రాష్ట్ర విభజన జరగకుండా ఉండి ఉంటే ఆ ఎన్నికల ఫలితాలు మరోలా ఉండేవేమో అనే అభిప్రాయాలు ఉన్నాయి. కానీ రాజధాని కూడా లేకుండా వీధిన పడిన రాష్ట్రానికి చంద్రబాబు దిశాదశ చూపిస్తారనే నమ్మకంతో ప్రజలు ఆయన్ను సీఎంను చేసుకున్నారు. ఇప్పుడు 2024లో కూడా అదే ఫీలింగ్ నాశనం అవుతున్న రాష్ట్రాన్ని కాపాడుకోవాలని అనే ఫీలింగ్ ప్రజల్లో కనిపించిందనే వాదన వినిపిస్తోంది. అరాచకాన్ని, అభద్రతా భావాన్ని, అభివృద్ధి శూన్యాన్ని అంగీకరించని జనం జగన్ పాలనపై తిరుగుబాటు చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వను అనే ప్రతిజ్ఞత పొత్తుకు జనసేనాని పవన్ కల్యాణ్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు హర్షించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం సహకారం అవసరమని, అందుకోసం బీజేపీతో పొత్తు పెట్టుకోవడం మంచి నిర్ణయమని మెజారిటీ ప్రజలు అంగీకరించారు. రాష్ట్రం బాగుపడా లనే బలమైన నిర్ణయంతో కూటమికి ఓట్లు వేశారు. ఆ కారణంగానే 2014 ఎన్నికల్లో ఇదే కూటమికి జిల్లాలో 44.1శాతం ఓటు షేరింగ్ జరిగితే 2024లో 55.54 శాతం ఓట్లు పడ్డాయి. అంటే 11.5 శాతం ఓట్లు అదనంగా వచ్చాయని పరిశీలకులు భావిస్తున్నారు.



అయ్యోయ్యో.. డబ్బులు పోయనే !

● పందేలు కాసిన వైసీపీ నేతల అంతర్మథనం

వలేటివారిపాలెం, జూన్ 6: కందుకూరులో ఎన్డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు గెలుస్తాడని లక్షకు రూ.2 లక్షలు, లక్షకు లక్షన్నర, లక్షకు లక్షా డెబ్బై వేలు, లక్షకు లక్షా ఎనభైవేలు ఇస్తామని టీడీపీ నాయకులు ఆఫర్ ఇచ్చారు. ఇందుకు వైసీపీ నాయకులు కొందరు ఓకే చెప్పారు. ఈ క్రమంలో మండలంలో రూ. 10 కోట్లకు పైగానే పందేలు నడిచినట్లు తెలుస్తోంది. అలాగే పలానా గ్రామంలో వైసీపీ కంటే టీడీపీకి ఎక్కువ ఓట్లు వస్తాయని, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, వైసీపీ కంటే టీడీపీకి ఎక్కువ సీట్లు వస్తాయని కూడా గ్రామాల్లోరూ. కోట్లు పందేలు కాశారు. ఆరా మస్తాన్ సర్వే వైసీపీకి అనుకూలంగా ఇవ్వడంతో టీడీపీ నాయకులు రూ.లక్షకు రూ. రెండు లక్షలు ఆఫర్ చేయడంతో వైసీపీ నేతలు జోరుగా పందేలు పెట్టారు. ఇలా వైసీపీ నాయకులు పందేలు కాసి రూ.10 కోట్లకుపైగానే పోగొట్టుకున్నారు. దీంతో వారు అటు అధికారం పాయె.. ఇటు డబ్బులు పాయె.. అంటూ మథనపడుతున్నారు.



చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వేమిరెడ్డి దంపతులు, కోటంరెడ్డి సోదరులు, బీద రవిచంద్ర

చంద్రబాబును కలిసిన నేతలు

నెల్లూరు (వైద్యం) : ఎన్నికలో ఘనవిజయం సాధించి టీడీపీ నాయకులు గురువారం ఉండవల్లిలోని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును కలిశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. భారీ మెజారిటీతో గెలుపొందిన వేమిరెడ్డి దంపతులను చంద్రబాబు అభినందించారు. అలాగే వీరు నారా లోకేష్‌ను కూడా కలిశారు. వీరి వెంట నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కూడా చంద్రబాబును కలిశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవి చంద్ర కూడా చంద్రబాబును కలిశారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభంజనం సృష్టించిందని ఇది చారిత్రాత్మక విజయమని బీద వెల్లడించారు.

'సోమశిల' ఖాళీ!

● డ్యాంలో పూర్తిగా అడుగంటిన నీరు

అనంతసాగరం, జూన్ 6 : నీటిమట్టం పడిపోతుండటంతో సోమశిల డ్యాం బోసిపోతోంది. ఎండ తీవ్రతతో ఉన్న జలాలు ఆవిరి రూపాంలో వృథ కావడం, ఎగువ నుంచి చుక్కనీరు కూడా రాకపోవడంతో జలాశయంలో గంగమ్మ పాతాళానికి చేరుకొంది. నీటి లభ్యత లేక అందవిహీనంగా మారుతున్న పరిస్థితిలో ఇక కొన్ని రోజుల్లోనే జలాశయ అడుగుభాగం బయట పడే సూచనలు కనిపిస్తున్నాయి. జలాశయం ఎగువన ఇప్పటికే సుమారు 50 నుంచి 100 అడుగుల మేరకు కొండ చరియలు బయటపడిన దృశ్యాలు చూసేవారికి ఆందోళన కలిగిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం నైరుతి రుతుపవనాలు వచ్చినా ఆశించిన మేరకు వర్షం కురవని పరిస్థితి. ఇక సాగు అవసరాలకు నీరు లేక అన్నదాతలు ఖరీఫ్‌కు విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అన్ని వేళలా డెల్టాలో నీటి లభ్యత ఉండే అవకాశం ఉన్నా ఈసారి కొన్నిచోట్ల బోర్లకు నీరుతగ్గి పొలాలు బీడుగా మారుతున్న దుర్భర పరిస్థితి కనిపిస్తోంది. సహజంగా ఆగస్టు నుంచి శ్రీశైలం- పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా తెలుగు గంగకు నీరు వచ్చే అవకాశం వుంది. అయితే అప్పటి వరకు నీటి అవసరాలు తీర్చుకొనేందుకు అవసరమైన మార్గాలను అన్వేషిస్తూ ఇంజనీర్లు తలలు పట్టుకొంటూనే డ్యాంలో ఉన్న నీటిని ఎగువ నుంచి వరదలు వచ్చే వరకు పొదుపుగా సర్దు బాటు చేసుకొనేలా కసరత్తు చేస్తున్నారు.

కల్యాణ వైభోగమే!

- కమనీయంగా ఆదిదంపతుల వివాహ వేడుక
- భక్తులతో కిక్కిరిసిన జొన్నవాడ

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 6 : వేదపండితుల మంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాలు, భక్తులే పెళ్లిపెద్దలుగా జొన్నవాడ క్షేత్రంలో గంగా, కామాక్షితాయి సమేత శ్రీమల్లికార్జున స్వామివారి కల్యాణం గురువారం అట్టహాసంగా జరిగింది. ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామిఅమ్మవార్ల కల్యాణ వైభోగాన్ని కనులారా వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తజనం తరలివచ్చింది. ఆలయ ముఖమండపంలో ప్రత్యేక పుష్పాలంకరణ, సుగంధ పరిమళాలతో ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవర్లను కొలువుదీర్చారు. స్వామి, అమ్మవార్ల ఎదురుకోలు సంప్రదాయం ఎంతగానో ఆకట్టుకుంది. కాగా, ఉభయకర్తలు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, పీతాంబరాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుక భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఏసీ శ్రీనివాసులు, ఈఓ గిరికృష్ణ, డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు సూరా ప్రదీప దంపతులతో పాటు సీఐ హైమారావు తదితరులు పాల్గొన్నారు. కామాక్షితాయి కల్యాణానికి వచ్చిన భక్తులు చదివింపులుగా రూ.2,18,211 సమర్పించుకున్నారు. అలాగే క్యూఆర్ కోడ్ ద్వారా కొంత మంది రూ.7,914 సమర్పించుకున్నారు.



ఆదిదంపతుల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

● తెప్పపై విహరిస్తూ..

గురువారం రాత్రి గంగ, కామాక్షి సమేతుడిగా శ్రీమల్లికార్జునస్వామివారు పెన్నా నదిలో హంస ఆకారంతో ప్రత్యేకంగా రూపొందించిన తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. నదిలో ఏర్పాటు చేసిన పలు శబ్దాలు, రంగురంగుల బాణాసంచా కాల్చడం ఆకట్టుకుంది. నది బ్రిడ్జిపైన, బ్రిడ్జి నుంచి ఆలయ సమీపం వరకు పెన్నానదికి ఇరువైపులా భక్తజనం పోటెత్తింది. కోడ్ ముగియడంతో ఆలయ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి కూడా పాల్గొన్నారు. కాగా, గురువారం రోజున భక్తులు తరలిరావడంతో నిత్యాన్నదాన సదనంతోపాటు టీటీడీ సత్రం ఆవరణలో కండక్టర్ సుధాకర్, ఆలయ సమీపంలో గౌరీశంకర్ ఫ్లవర్ డెకరేషన్స్ యజమాని దామరమడుగు శ్రీనివాసులు, కాశీ అన్నపూర్ణేశ్వరి అన్నదాన సదనంలో అన్నదానం చేశారు. స్థానిక ఆలయ పురోహితులు గొల్లనపల్లి బ్రదర్స్ ఆధ్వర్యంలోనూ బ్రాహ్మణ సామాజిక వర్గం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



పెన్నానదిలో హంస ఆకారంలో రూపుదిద్దుకున్న తెప్ప, ఉత్సవర్లను తీసుకొస్తున్న భక్తులు



రాజగోపాల్‌రెడ్డి

విక్రమ్‌రెడ్డి



మేకపాటి రాజమోహన్‌రెడ్డి

మేకపాటి కోటకు బీటలు!

- ఆత్మకూరులో ఓటమితో వైసీపీలో అంతర్మథనం
- ఉదయగిరిలోనూ తప్పని పరాభవం

ఆత్మకూరు/ఉదయగిరి రూరల్, జూన్ 6 : వైసీపీ ముఖ్యనేత, నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి కుటుంబానికి కీలకమైన ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో ప్రస్తుత ఎన్నికల్లో భంగపాటు తప్పలేదు. ఆత్మకూరులో వరుసగా రెండుసార్లు, ఉప ఎన్నికల్లోనూ గెలుపొందిన మేకపాటి కుటుంబానికి ఈసారి పరాజయం తప్పలేదు. ఆ కుటుంబం నుంచి బరిలో దిగిన మేకపాటి విక్రమ్‌రెడ్డిపై టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి 7,718 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మేకపాటి కుటుంబానికి అత్యధిక మెజారిటీ తెచ్చిపెట్టే సొంత మండలం మర్రిపాడుతో పాటు అనంతసాగరం మండలంలో సైతం ఈ ఎన్నికల్లో గట్టి దెబ్బ తగిలింది. ఆత్మకూరు రూరల్‌తోపాటు మున్సిపాలిటీ పరిధిలోనూ టీడీపీ పట్టు సడలలేదు. కౌంటింగ్‌కు ముందు ఆత్మకూరు మున్సిపాలిటీలో వైసీపీకే ఆధిక్యత వస్తుందనే అంచనాలు తలకిందులయ్యాయి. సమీకరణలు తారుమారయ్యాయి. ఊహించని విధంగా ఈసారి ఎన్నికల్లో వైసపీ ఆధిపత్యం ఉన్న అనంతసాగరం, మర్రిపాడు, సంగం మండలాల్లో ఆ పార్టీకి ఆధిక్యతకు గండి పడింది.

● సొంత మండలం నుంచే..

వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డికి తన సొంత మండలం మర్రిపాడులో 2019 ఎన్నికల్లో 5062 ఓట్లు వస్తే ఈ ఎన్నికల్లో 1,136 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇక అనంతసాగరం మండలంలో 2019లో 7592 ఓట్లు వస్తే ఈ ఎన్నికల్లో 802, ఏఎస్‌పేట మండలంలో కేవలం 691 ఓట్లు మాత్రమే వైసీపీకి మెజారిటీ ఓట్లు వచ్చాయి. ఇక ఆత్మకూరు, సంగం, చేజర్ల మండలాల్లో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తన ఆధిక్యతను కొనసాగించారు. సంగం మండలంలో 3,446 ఓట్లు, చేజర్ల మండలంలో 2,321, ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో 2064, ఆత్మకూరు రూరల్‌లో 1203 ఓట్ల ఆధిక్యతను సాధించారు. ఇక ఉదయగిరిలోనూ మేకపాటి కుటుంబానికి భంగపాటు తప్పలేదు. వైసీపీ తరఫున మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఎన్డీఏ కూటమి నుంచి కాకర్ల సురేష్ బరిలో నిలిచారు. కాకర్ల సురేష్‌కు 1,01,537 ఓట్లు, మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి 91,916 ఓట్లు దక్కాయి. దీంతో 9,621 ఓట్లు ఆధిక్యతతో కాకర్ల సురేష్ విజయం సాధించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో కాకర్ల సురేష్‌కు 1,810 ఓట్లు రాగా, మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి 933 ఓట్లు దక్కాయి.

● కలిసిరాని సంక్షేమ పథకాలు

ఈ నియోజకవర్గాల్లో వైసీపీ ఓటమికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వైసీపీ నేతలు గెలుపుపై అతి నమ్మకం ప్రదర్శించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలే గెలిపిస్తాయని, దానికితోడు కోట్ల రూపాయలు ఖర్చు చేయడంతో తప్పక గెలుస్తామని పూర్తిగా నమ్మకం పెట్టుకున్నారు. ఇదే కొంపముంచింది. మరోవైపు జగన్మోహన్‌రెడ్డి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, వృద్ధులు, మహిళలపై ఎక్కువ ఆశ పెట్టుకున్నారు. వీటితోపాటు వైసీపీ విజయానికి దోహద పడుతుందనుకున్న నవరత్నాలు ఆశించిన మేర ఫలితాలు ఇవ్వలేకపోయాయి.

భలే భలే బుల్లెట్!



టీడీపీ సింబల్‌తోపాటు ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఫొటోతో పసుపు రంగులో ఉన్న బుల్లెట్ బండి ఒకటి కావలిలో చక్కర్లు కొడుతోంది. గురువారం కావలి మున్సిపల్ కార్యాల యం వద్ద ఆ బండి ఆంధ్రజ్యోతి కంట పడింది. పట్ట ణంలో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పట్టణంలోని ముసు నూరుకు చెందిన టీడీపీ నాయకుడు బొట్లగుంట శ్రీహరినాయుడు దీన్ని వినియోగిస్తున్నారు.

- కావలి

ఓట్లేయలేదని నీటి ట్యాంకర్ల నిలుపుదల

- కావలిలో వైసీపీ నేతల నిర్వాకం
- బాధ్యులపై చర్యలకు ప్రజల డిమాండ్

కావలి, జూన్ 6 : ఎన్నికల్లో ప్రజలు ఛీకొట్టినా కావలి వైసీపీ నేతల వక్రబుద్ధి మార లేదు. పట్టణంలో వైసీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారమెత్తి ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తున్నారు. సగం ట్యాంకర్లకు రెట్టింపు బిల్లులు పెట్టుకుంటున్నారు. ప్రజలు తమకు ఓటేయలేదనే అక్క సుతో వైసీపీ నాయకులు ప్రజలకు తాగునీరు లేకుండా ఇబ్బందులు పెట్టాలని రెండు రోజు లుగా ట్యాంకర్లను ఆపేశారు. బుధవారం సగం ట్యాంకర్లను ఆపగా, గురువారం మొత్తం ట్యాం కర్లను ఆపారు. టీడీపీ ప్రభుత్వం వస్తే నీటిసరఫరా చేయలేక పోయామని, నింద మోపేందుకు ఈ చీప్ ట్రిక్స్‌ను ప్రదర్శించారనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం పట్టణంలో 17 నీటి ట్యాం కర్లను వైసీపీ నేత లావణ్యరెడ్డి పేరు మీద కాంట్రాక్ట్ తీసుకుని సరఫరా చేస్తున్నారు. వారు ఎన్ని ట్రిప్పులు తోలినా 8నుంచి 10 ట్రిప్పులకు తగ్గకుండా రాసుకుంటున్నారు. అయితే వైసీపీ నాయకులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా నీటి సరఫరాను నిలిపివేయటం పట్ల పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బినామీ కాంట్రాక్టర్ల అవతారమెత్తిన వైసీపీ నాయ కులపై చట్టపర మైన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ అధికా రులు స్పం దించి తక్షణం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటో బోల్తా: ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

వరికుంటపాడు, జూన్ 6: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గురువారం వేగంగా వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడిం ది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ప్రకాశం జిల్లా పామూరు నుంచి జాతీయ రహదారిపై తూర్పుబోయ మడగలకు వెళ్తున్న ఆటో గ్రామానికి వెళ్లే లింకు రోడ్డు వద్ద మలుపు తిరుగుతూ బోల్తా పడింది. ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన డ్రైవర్ సోమవరపు నాగూర్‌తో సహా ఆటోలో ప్రయాణిస్తున్న మస్తాన్‌వలి గాయపడ్డారు. ఆటో సైతం కొంతమేర దెబ్బతింది. ఇరువురిని చికిత్స నిమిత్తం 108వాహనంలో వైద్యశాలకు తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఉదయగిరికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

ల్యాంకో వృద్ధాశ్రమ మోటారు చోరీ



పైపులైన్ల వద్ద కనిపించని మోటారు

సంగం, జూన్ 6: స్థానిక అమరపనాయుడు కండ్రికలో ఏర్పాటు చేసిన ల్యాంకో వృద్ధాశ్ర మానికి చెందిన మోటారును బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఆశ్రమ నిర్వాహకులు గురువారం సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వృద్ధాశ్రమంలోని చెట్లకు నీటి సదుపాయం కోసం దక్షిణం వైపు ప్రహరీ బయట ఉన్న కనిగిరి ప్రధాన కాలువ నుంచి లూజ్ నీటిని తరలించేందుకు ఇటీవల రూ.30వేలతో 5హెచ్‌పీ కొత్త మోటారును ఏర్పాటు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక తరలింపు వాహనాల అడ్డగింపు



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన వాహనాలు

మర్రిపాడు, జూన్ 6: మండలకేంద్రంలోని ఇసుక డంపుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను టీడీపీ నాయకులు గురువారం అడ్డుకుని పోలీసు లకు అప్పగించారు. గత ప్రభు త్వంలో సోమశిల ఇసుక రీచ్ నుంచి ఇసుకను తీసుకొచ్చి మర్రిపాడులో నిల్వ చేసి అమ్మకాలు ప్రారంభించారు. అయితే ఎన్నికలు ప్రారంభం నాటి నుంచి అమ్మకాలు నిలిపివేశారు. మూడు రోజులనుండి అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపిస్తూ ఆ వాహనా లను టీడీపి నాయకులు అడ్డుకున్నారు. అక్కడికి చేరుకున్న మైనింగ్ అధికారులు నాలుగు ట్రాక్టర్లు, నాలుగు లారీలు, ఒక జేసీబీని పోలీసుస్టేషన్‌కు తరలించారు.





వాన.. వాన.. వందనం

నెల్లూరు నగరంలో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. మధ్యాహ్నం తర్వాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ఆకాశం మేఘావృతమైంది. కాసేపటికి చిరుజల్లులతో మొదలై ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. సుమారు రెండు నెలలుగా మండే ఎండలతో అల్లాడిన నగర వాసులకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	159
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	280
స్కిన్‌లెస్	310
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6928
వెండి కిలో ధర	రూ. 93,000
వెండి ఒక గ్రాము	రూ. 95.00







పెద్ద పెద్ద గుంతలు
పొంచి ఉన్న ప్రమాదం

నెల్లూరు నగర శివార్లలోని అంబాపురం చెరువును గ్రావెల్ కోసం ఇష్టం వచ్చినట్లు తవ్వేశారు. దీంతో చెరువు నిండా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అవి ప్రమాద హెచ్చరికలు చేస్తున్నాయి. తాజాగా జిల్లాలో వర్షాలు మొదలైనందున చెరువు గుంతల్లో నీరు నిలిస్తే అది మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే చెరువులో నీటి కోసం పశువులు దిగుతున్నాయి, అలాగే బహిర్భూమికి, ఈత కొట్టేందుకు వచ్చే వారు లోతు తెలియక ఈ గుంతల్లో చిక్కుకునే ప్రమాదం ఉంది.



- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

10న క్రికెట్ జిల్లా జట్ల ఎంపికలు

నెల్లూరు (విద్య), జూన్ 6 : జిల్లా క్రికెట్ అసోసియే షన్ ఆధ్వర్యంలో ఈనెల 10వతేదీన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్-16 జిల్లా క్రికెట్ జట్ల ఎం పిక నిర్వహిస్తు న్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డీ నిఖిలేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, వయసు ధ్రువీకరణ పత్రాలతోపాటు సొంత క్రికెట్ కిట్, వైట్ అండ్ వైట్ డ్రస్ కోడ్‌తో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

'పది' మూల్యాంకనం ప్రారంభం

- జిల్లాకు 7,224 సమాధాన పత్రాలు

నెల్లూరు (విద్య), జూన్ 6 : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాల మూల్యాంకనం గురువారం ప్రారంభించారు. నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఈనెల 9వతేదీ వరకు ఈ కార్యక్రమం జరగనుంది. వివిధ జిల్లాలకు చెందిన 7,724 సమాధాన పత్రాలు జిల్లాకు చేరడంతో వీటిని కట్టుదిట్టమైన భద్రత నడుమ మూల్యాంకనం చేప ట్టేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. మూల్యాంక నానికి చీఫ్ ఎగ్జామినర్లు 28 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 121, స్పెషల్ అసిస్టెంట్లు 39 మంది కలిపి మొత్తం 188 మంది హాజరవుతున్నారన్నారు. మూల్యాంకనం విధులు కేటాయించిన ఉపాధ్యాయులు కచ్చితంగా విధులకు హాజ రుకావాలని అధికారులు ఆదేశించారు. ప్రతి రోజూ ఉద యం 8.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మూ ల్యాంకనం జరుగుతుందని తెలిపారు. కాగా, ఈ మూల్యాం కనాన్ని డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మి పర్యవేక్షిస్తున్నారు.

సోమశిలలో 7.296 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూన్ 6: సోమశిల డ్యాం పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. గురువారానికి 7.296 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలి పారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

టీచర్ల దొడ్డిదారి బదిలీలకు బ్రేక్

- జిల్లాలో 49 మందికి సిఫార్సు లేఖలు
- గుట్టుచప్పుడు కాకుండా ఉత్తర్వులు
- ఎన్నికల ఫలితాలతో హడావిడిగా నిలుపుదల

నెల్లూరు (విద్య), జూన్ 6 : కౌన్సెలింగ్‌తో సంబంధం లేకుండా జిల్లాలో దొడ్డిదారిన చేపట్టిన టీచర్ల బదిలీలకు బ్రేక్ పడింది. పలుకుబడి ఉన్నవారికి, సిఫార్సు లేఖలతో అభ్యర్థించినవారికి, నగదు సమర్పించుకున్న వారికి కోరుకున్న చోటకు రెగ్యులర్ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో రెండు విడతలుగా 49 మంది టీచర్లకు సిఫార్సు బదిలీలకు రాజ కీయ, అధికార ఒత్తిళ్లకు జిల్లా విద్యాశాఖ అధికారులు తలొగ్గారు. దీంతో బ్లాక్‌చేసిన వేకెన్సీలు, పదోన్నతుల్లో ఏర్పడిన ఖాళీల్లో పోస్టింగ్‌ల ఉత్తర్వు లను గుట్టుచప్పుడు కాకుండా జారీ చేశారు. తాజాగా ఎన్నికల ఫలితాలతో ప్రభుత్వం మారిన నేపథ్యంలో విద్యాశాఖ కమిషనర్ వెంటనే సిఫార్సు బదిలీలన్నింటిని నిలుపుదల చేయాలని జిల్లా విద్యాశాఖను ఆదేశించారు.



వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పుకున్న నవరత్నాల సంక్షేమ పథకాల అమలు మాదిరిగా టీచర్లకూ ప్రభుత్వ ఉత్తర్వు బదిలీల పథకం అమలు చేశారన్న విమర్శలు ఉపాధ్యాయ వర్గాల్లో వెల్లువెత్తాయి. డబ్బులిచ్చి కోరుకున్న చోటుకు బదిలీపై వెళ్లాలనే వారి బలహీనతే ఆసరాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలో ఎస్‌జీటీలు, ఎస్‌ఏలు కలిపి మొత్తం 49 మందికి ప్రభుత్వ ఉత్తర్వులు సీల్డ్‌కవర్లలో జిల్లా విద్యాశాఖకు పంపించారు. మరికొన్ని ఉత్తర్వులు కూడా వచ్చే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో వాటిని నిలిపివేశారు. జిల్లాలో గత ఏడాది జూన్‌లో జరిగిన సాధారణ బదిలీల్లో దాదాపు నాలుగు వేలమంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగింది. జీవో నెం 117 ఉత్తర్వులు, పాఠశాలల విలీనం, రేషనలైజేషన్ తదితర కారణాలతో పలువురు టీచర్లకు అప్పటివరకు పనిచేసిన ప్రాంతం, మండలం, డివిజన్ దాటి సుమారు 100 నుంచి 200 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలకు బదిలీ కావాల్సి వచ్చింది. ఈ నిబంధనలను సవరించాలని దూరప్రాంతాలకు బదిలీ అయిన టీచర్లు ప్రభుత్వాన్ని వేడుకున్నా పట్టించుకోలేదు. ఇందుకు భిన్నంగా గతంలో కొన్ని దొడ్డిదారి బదిలీలు చేపట్టగా ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. అయినా కొన్ని జరిగిపోగా తాత్కాలికంగా మరికొన్నింటికి బ్రేక్ వేశారు. తాజాగా మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎన్నికల సమయం దగ్గరపడుతున్న సమయంలో ఇదే అదునుగా దొడ్డిదారిన బదిలీలు చేపట్టారు. బదిలీ ఉత్తర్వులను ప్రభుత్వం నుంచి తెచ్చుకున్న వారంతా పలుకుబడి, అధికారపక్షం అండదండలున్నవారేనని, బ్లాక్‌చేసిన వేకెన్సీలు, పదోన్నతుల కారణంగా ఏర్పడిన ఖాళీల్లో వీరిని నియమించేందుకు రహస్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు భగ్గుమన్నా కూడా వీటిని నియంత్రించలేక పోయారు.

డబ్బిస్తే కోరుకున్న చోటకు బదిలీ

బదిలీలు కోరుకున్న వారంతా స్థానికంగా ప్రజాప్రతినిధుల నుంచి లేఖలు తీసుకుని రాష్ట్ర కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన అనధికార కౌంటర్‌లో నగదు చెల్లించారు. అక్కడ నుంచి ఉత్తర్వులు జిల్లాకు వచ్చాక ఇక్కడ కూడా కొంత ముట్టచెప్పి, కోరు కున్నచోటుకు బదిలీ చేయించుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకేచోట ఎక్కువకాలం పనిచేస్తున్నవారు, గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నవారు అక్రమ బదిలీలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగర, పట్టణ ప్రాంతాల్లోని పోస్టులన్నీ కూడా ఇలా అడ్డదారిన భర్తీ చేస్తుంటే సాధారణ బదిలీ ప్రక్రియ జరిగే సమయంలో తమకు పూర్తిగా అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్య సమస్యలు, ప్రత్యేక కారణాలతో అసాధారణ పరిస్థితుల్లో ఉపయోగించుకోవాల్సిన ప్రభుత్వ ఉత్తర్వుల బదిలీలను ఏకంగా కౌంటర్ తెరిచి అడ్డగోలుగా చేపడుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై విద్యాశాఖాధికారులు కూడా స్పష్టతనిచ్చారు. బదిలీ జీవోలు జిల్లాకు వచ్చిన మాట వాస్తవమేనని, అయితే అన్ని ఉత్తర్వులు కూడా సీల్డ్ కవర్లలో తమకు అందాయని, వాటిలో ఎస్‌జీటీల ఉత్తర్వులను సంబంధిత ఎంఈవోలకు, స్కూల్ అసిస్టెంట్ ఉత్తర్వులను సంబంధిత డిప్యూటీ ఈవోలకు అందచేశామన్నారు. వీటిని ఆయా డిప్యూటీఈవోలు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పరిశీలించుకుని వారికి ఉత్తర్వులు అందచేశారన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులను కూడా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

పాఠ్యపుస్తకాల పంపిణీకి కసరత్తు

- స్కూళ్ల పునఃప్రారంభానికి ముందే జిల్లాకు రాక
- కావాల్సిన పుస్తకాలు 14,50,167
- గోదాముకు చేరినవి 5,73,558
- గత ఏడాది మిగిలినవి 1,52,459
- 1 నుంచి 7 తరగతి వరకు జిల్లా డిపో నుంచి...
- 8 నుంచి 10 వరకు నేరుగా మండలాలకు...

నెల్లూరు (విద్య), జూన్ 6 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు పాఠ్యపుస్తకాలనూ కూడా ప్రభుత్వం ఉచితంగానే అందిస్తోంది. కొన్నేళ్లుగా విద్యాశాఖ వైఫల్యంతో పుస్తకాలు అందించే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో పుస్తకాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత సంఘటనలు పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో ఉన్నతాధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. వేసవి సెలవులు పూర్తి కాకముందే జిల్లా కేంద్రం నుంచి మండలాల వారీగా పుస్తకాల పంపిణీ ప్రారంభించారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో అప్పటిలోగా పుస్తకాలన్నింటినీ పాఠశాలలకు చేర్చేందుకు చర్యలు చేపడుతున్నారు.

పుస్తకాల తరలింపునకు ఏర్పాట్లు

జిల్లాలో మొత్తం 2,637 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఈ విద్యా సంవత్సరానికి 14,50,167 పాఠ్య పుస్తకాలు అవసరమని అధికారులు గుర్తించారు. గత ఏడాది 1,52,459 పుస్తకాలు మిగలగా, ఈ ఏడాది 1 నుంచి 7వతరగతి వరకు 8,4,108 పాఠ్య పుస్తకాలు, 8 నుంచి 10వతర గతి వరకు 6,46,059 పాఠ్యపుస్తకాలు అవసరమని ఇండెంట్ పంపారు. కాగా ఇప్ప టికే ఈ విద్యాసంవత్స రానికి 1 నుంచి 7వతరగతి వరకు 5,73,558 పుస్తకాలు జిల్లాకు చేరగా, 8 నుంచి 10వతరగతి వరకు 4 లక్షల పాఠ్యపుస్తకాలు మండల కేంద్రాలకు చేరుకున్నాయి. మిగిలిన పుస్తకాలన్నీ కూడా వేసవి సెలవులు పూర్తయ్యే లోగా విడతల వారీగా గోదాముకు తరలించి అక్కడ నుంచి మండలాలలకు, మండలాల నుంచి పాఠశాలలకు తరలించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలలు తెరిచేనాటికి వందశాతం పుస్తకాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు.



గోదాములో నిల్వ ఉన్న పాఠ్యపుస్తకాలు

బైలింగ్విల్ విధానంలో ముద్రణ

ఆంగ్లం, తెలుగు మీడియం విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా 1 నుంచి 10వతరగతి వరకు పాఠ్యపుస్తకాలను బైలింగ్విల్ విధానంలో ముద్రిస్తున్నారు. ఇలా ఒకే పుస్తకంలో తెలుగు, ఆంగ్ల భాషల్లో పాఠ్యాంశాలు ఉండడంతో విద్యార్థులకు మేలు జరిగే అవకాశం ఉంది. నూతన విద్యా సంవత్సరంలో టెన్త్ విద్యార్థులకు మాత్రం ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా స్వల్ప మార్పులతో పుస్తకాలను ముద్రిస్తున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ విధానాన్ని పూర్తిస్థాయిలో మార్పు చేశారు. గతంలో కనీసం ఆరు నెలల ముందుగానే మీ పాఠశాలలకు ఎన్ని పాఠ్య పుస్తకాలు అవసరమని నివేదికలు కోరగా, వచ్చే ఏడాదికి కనీసం పదిశాతం అదనంగా పాఠ్యపుస్తకాల ఇండెంట్ పెట్టేవారు. ఈ ఇండెంట్ మేరకు ఆయా మండలాలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ జరిగేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో సేకరించడంతో వారి సంఖ్యకు అనుగుణంగానే ఆయా పాఠశాలలకు పాఠ్యపస్తకాలను పంపిణీ చేస్తున్నారు. గతంలో మిగిలిన పాఠ్య పుస్తకాలు పక్కదారి పట్టడంతో అక్రమాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు అధికార యంత్రాంగ చర్యలు చేపట్టింది.

పాత విధానంలోనే..

జిల్లాల విభజన జరిగినా పాత విధానంలోనే పుస్తకాల పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరులోని జిల్లా ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విక్రయ కార్యాలయం నుంచి నేరుగా జిల్లాలోని అన్ని మండలాలకు పుస్తకాల పంపిణీ జరుగుతోంది. గతంలో జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తకాల విక్రయ కార్యాలయం 1 నుంచి 10వతరగతి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసేవారు. ఈ ఏడాది 1 నుంచి 7వతరగతి వరకు మాత్రమే జిల్లా కేంద్రం నుంచి అందిస్తున్నారు. 8 నుంచి 10వతరగతి వరకు ప్రింటింగ్ ప్రెస్ నుంచి నేరుగా మండల కేంద్రాలకు చేరవేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా స్టాక్ పాయింట్‌కు చేరిన పాఠ్యపుస్తకాల్లో మొదటి విడతలో 4,66,254 పాఠ్యపస్తకాలను పాఠశాలలకు పంపించగా, మిగిలిన పుస్తకాలన్నీ కూడా పాఠశాలలు తెరిచేనాటికి వందశాతం చేరవేస్తామని అధికారులు తెలిపారు.

విద్యార్థులందరికీ పుస్తకాలు

జూన్ మొదటివారంలోగా పుస్తకాలన్నీ అన్ని మండల కేంద్రాలకు అక్కడ నుంచి పాఠశాలలకు తరలిస్తాం. పుస్తకాలు పక్కదారి పట్టకుండా అన్ని మండల కేంద్రాలకు, అక్కడ నుంచి అన్ని పాఠశాలలకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి ప్రతి విద్యార్థి చేతికి పుస్తకాలు అందిస్తాం.

- పీజేవీ. రామారావు, డీఈవో

దుర్గమ్మ సేవలో ముఖ్యులు

విజయవాడ (వన్‌టౌన్) : విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మవారిని గురువారం ఇటీవల ఎన్నికలలో గెలిచిన పలువురు ప్రజాప్రతినిధులు గురువారం దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని అర్చకుల ఆశీస్సులను పొందారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో శ్రీకాకుళం ఎంపీ అప్పలనాయుడు, అరకు ఎమ్మెల్యే మత్స్య లింగం, పత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్, బీద రవిచంద్ర, రామ్‌గోపాల్ రెడ్డి ఉన్నారు.

నిత్యావసరాల్లో కోత.. కార్డుదారుల ఆందోళన

● బియ్యం, అరకొరగా చక్కెర పంపిణీ



లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం

ఉదయగిరి రూరల్, జూన్ 6: పౌరసరఫరాల ద్వారా నిరుపేదలకు అందుతున్న నిత్యావసర సరుకుల్లో కోత విధిస్తూనే ఉంది. నిన్నమొన్నటి వరకు అరకొరగా పంపిణీ చేసే కందిపప్పు, గోధుమపండి, రాగిపిండిని పూర్తిగా నిలిపి వేసింది. చక్కెర మాత్రమే పంపిణీ చేస్తోంది. అదీ కార్డుదారుడు చక్కెర అని అడిగితే ఇస్తున్నారు. దీంతో పేదలకు పూర్తిస్థాయిలో సరుకులు అందడం లేదు. ప్రతినెలా అందించే కందిపప్పును వైసీపీ ప్రభుత్వం గతేడాదిగా అరకొరగానే సరఫరా చేసింది. సార్వత్రిక ఎన్నికల సమయంలోనైనా నూరు శాతం కుటుంబాలకు ఇస్తారని ఎదురుచూసిన కార్డుదారులకు నిరాశే మిగులుతోంది. జిల్లాకు ప్రభుత్వం కందిపప్పు అరకొరగా కేటాయించడంతో పూర్తిస్థాయి లబ్ధిదారులకు అందడం లేదు. ఉదయగిరి సివిల్ సప్లయ్ గోదాం పరిధిలో సీతారామపురం, వరికుంటపాడు, ఉదయగిరి, మర్రిపాడు మండలాల్లో 38వేల కార్డులున్నాయి. జూన్‌నెలకు సంబంధించి బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేసి కందిపప్పు పంపిణీ చేయక పోవడంతో కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలోనైనా అన్నిసరుకులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముమ్మరంగా బీసీజీ వ్యాక్సినేషన్



కోటవీధిలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

సీతారామపురం, జూన్ 6: అయ్యవారిపల్లి, సోంపల్లి, నారాయణంపేట, సీతారామపురం, బోడసిద్దాయపల్లి, పండ్రంగి పబ్బులేటిపల్లిల్లోని 221మంది వయోజనులకు గురువారం వైద్య సిబ్బంది బీసీజీ వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమాన్ని వైద్యాధికారి స్వప్న పరిశీలించి మాట్లాడారు. క్షయవ్యాధి సోకకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ మజీద్, ఎంపీహెచ్ఎస్ రియాజ్, ఎంపీఎన్ క్రిష్టమ్మ, హెల్త్‌అసి స్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు బేబి, వసంత, సుహాషిణి, మేరీ, బీబి పాల్గొన్నారు.

రహదారిపైనే మురుగునీరు



రహదారిపై నిల్వ చేరిన మురుగు నీరు

ఉదయగిరి రూరల్, జూన్ 6: స్థానిక శ్రీనగర్‌కాలనీలోని ప్రధానరోడ్డుపై మురుగునీరు నిల్వ చేరడంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు కాలువలు పూడికతో నిండిపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపై పారుతూ పరిశుభ్రత నెలకొంది. దీనికితోడు పాదాచారులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారుతోంది. మురుగునీరు దోమలకు ఉత్పత్తి కేంద్రంగా మారి దుర్వాసన వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపై నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిశుభ్రతను పాటించాలి

ఉదయగిరి రూరల్, జూన్ 6: ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వ్యాధులకు దూరంగా ఉండాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి శివకల్పన సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా గురువారం గండిపాళెం గురుకుల పాఠశాలలో కీటక జనితవ్యాధుల నుంచి పిల్లలను రక్షించేందుకు తరగతి గదులు, మరుగుదొడ్లలో మలాథియన్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. అనంతరం విద్యార్థులకు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యాలపై అగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిం చాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, హెల్త్ అసిస్టెంట్ చంద్రమౌళి పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

సంగం, జూన్ 6: స్థానిక శాఖ గ్రంథాలయంలోని వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన, తెలుగు పద్య పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని లైబ్రేరియన్ రవీంద్రరెడ్డి పర్యవేక్షించారు.

అంకాళమ్మ ఆలయంలో అన్నదానం

అనంతసాగరం, జూన్ 6: స్థానిక సోమశిల రోడ్డులో వెలసిన గ్రామదేవత అంకాళమ్మ ఆలయంలో గురువారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఉభయకర్తగా చల్లా అవినాష్ రెడ్డి వారి కుటుంబసభ్యులు అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయధర్మకర్త బట్రెడ్డి కృష్ణారెడ్డి, చల్లా శివారెడ్డి పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

లోకేష్‌ను కలిసిన కాకర్ల సురేష్ దంపతులు



నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాకర్ల దంపతులు, కుమార్తె ధాత్రి

ఉదయగిరి రూరల్/వింజమూరు, జూన్ 6: ఉండవల్లిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను గురువారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆయన సతీమణి ప్రవీణలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎన్నికల్లో ఘనవిజయం సాధించడం, వైసీపీ కంచుకోటను బద్దలు కొట్టి మునుపెన్నడూలేని మెజార్టీ సాధించడంతో కా కర్ల సురేష్‌ను లోకేష్ ఆలింగనం చేసుకొని అభినందించారు. ఉదయగిరి అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని లోకేష్ సూచించినట్లు కాకర్ల తెలిపారు. తొలుత విజయ వాడ కనకదుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. వారివెంట కుమార్తె ధాత్రి ఉన్నారు.

ఎమ్మెల్యే ఆనం, ఎంపీ వేమిరెడ్డికి అభినందనలు



ఎమ్మెల్యే ఆనంను సన్మానించిన కంచి పరమేశ్వరరెడ్డి తదితరులు

ఆత్మకూరు : ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలకు గురువారం పలువురు నేతలు అభినందనలు తెలిపారు. సాంబశివ చారిటబుల్ చైర్మన్ కంచి పరమేశ్వర రెడ్డి, బీజేపీ సీని యర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడు ముల సుధాకర్‌రెడ్డితో పాటు సో మవరపు యానాదిరెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, రామాల హరి ప్రసాద్‌రెడ్డి నెల్లూరుకు వెళ్లి వారిని కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు.

కొనసాగుతున్న టీడీపీ సంబరాలు



వెంగారెడ్డిపాళెంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సంబరాలు



జంగాలకండ్రికలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు

సంగం, జూన్ 6: మండలంలోని జంగాలకండ్రిక, చెన్నవరపాడు, వెంగారెడ్డిపాళెంలో గ్రామాల్లోని టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి స్థానికులకు పంచిపెట్టారు. వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ గెలుపు సంబరాలు చేసుకున్నారు.

బెట్టింగులతో నాయకుల డీలా!

● ఆర్థికంగా చితికిపోయిన సామాన్య కుటుంబాలు

ఆత్మకూరు, జూన్ 6: ఎన్నికల ఫలితాలపై నరాలు తెగే ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడం.. ఆత్మకూరులో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి గెలుపొందడంతో బెట్టింగుబాబుల ఆశలు నీరుగారిపోయాయి. రూ.50 వేలకు రూ.75వేలు, రూ.లక్షకు రూ.లక్షన్నరపై ఇస్తామని వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య పందెలు నడిచాయి. ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గెలుపుతో డబ్బు పోగొట్టుకున్న బెట్టింగు రాయుళ్లు డీలా పడ్డారు. మే 13న పోలింగ్ ప్రక్రియ పూర్తయినప్పటి నుంచి వైసీపీయే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కొందరు, స్థానికంగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుస్తాడని మరికొందరు, టీడీపీ గెలుస్తుందని ఇంకొందరు బెట్టింగులు జోరుగా చేపట్టారు. ఓట్లు లెక్కింపునకు మూడురోజుల ముందు టీడీపీ గెలుస్తుందని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవుతాడని కొన్నిసర్వేలు వెల్లడించాయి. మరికొన్ని సర్వేలు వైసీపీ అధికారంలోకి వస్తుందని తెలిపాయి. బెట్టింగ్ బాబులు వైసీపీ గెలుస్తుందనే ధీమాతో వేలలో పందెలు కాసిన వారికి వైసీపీ ఓటమితో ఆర్థికంగా ఎంతో మందికి ఎదురుదెబ్బ తగిలింది. పందేల ఆశతో కొన్ని కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి బయటకు చెప్పలేక కంటిచూపు తప్ప నోరు మెదపని పరిస్థితి ఏర్పడింది. గెలుపు ఓటములు సహజంగా స్వీకరించాలే తప్ప బెట్టింగ్‌లు జోలికి వెళ్లి ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతినరాదని వచ్చే ఎన్నికల్లో అయినా ఆశిద్దాం.

ఆక్రమిత పొలాల పరిశీలన

చేజర్ల, జూన్ 6: ఆదురుపల్లి సమీపంలోని చిత్తలూరు వరద కాలువను సమీప పొలాల రైతులు ఆక్రమించి పైన ఉన్న పొలాలకు దారి లేకుండా చేశారు. ఈ విషయంపై పలుమార్లు రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా వైసీపీ నా యకుల ఒత్తిడి మేరకు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు గురువారం ఇరిగేషన్ ఏఈ సురేష్ స్థానిక రైతులతో కలసి కాలువలను పరిశీలించారు. ఆక్రమణ జరిగిన విషయం వాస్తవం అని, త్వరలో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాలువలపై మూతలు మరిచారు

ఉదయగిరి రూరల్, జూన్ 6: పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధి, శ్రీనగర్‌కాలనీ, కోళ్ల వీధి, యాదవపాళెం, బీసీ కాలనీల్లో కొన్ని నెలల క్రితం నూతనంగా మురుగు కాలువలు నిర్మించారు. వాటిపై మూతలు అరకొరగా ఏర్పాటు చేయడం, మరికొన్ని ప్రాంతాల్లో అసలు ఏర్పాటు చేయకపోవడంతో పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాలువల్లో చెత్తాచెదారం నిండి దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు కొన్ని ప్రాంతాల్లో కాలువలు సక్రమంగా నిర్మించకపోవడంతో మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదని, కాలువల నిర్మాణ సమయంలోనే ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

కరెంటు పోతే కష్టాలే..!

● నిరుపయోగంగా మారిన జనరేటర్
● మరమ్మతులకు నోచుకోని ఇన్‌వర్టర్లు
● తహసీల్దార్ కార్యాలయంలో ఇదీ దుస్థితి



ఎండలోనే ఏర్పాటు చేసిన జనరేటర్



మూలన పడేసిన ఇన్‌వర్టర్లు

వరికుంటపాడు, జూన్ 6: స్థానిక తహసీల్దారు కార్యాలయానికి ఏళ్ల తరబడి కరెంటు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. నిత్యం ఉద్యోగులు, ప్రజలతో రద్దీగా ఉండే కార్యాలయానికి కనీస వసతులు సమకూర్చుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. విధి నిర్వహణకు ఎలాంటి ఆటంకం ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి కార్యాలయ ఆవరణలో జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో బాగానే వినియోగం సాగింది. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఉండటం వలన మొరాయించేది. ప్రస్తుతం పనిచేయక నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం వాటిని పట్టించుకొనే నాథులే కరువయ్యారు. అనంతరం ఏర్పాటు చేసుకున్న ఇన్‌వర్టర్లు సైతం మరమ్మతులకు నోచుకోలేదు. దుమ్ము, ధూళితో నిండి వెక్కిరిస్తున్నాయి. ప్రస్తుతం వేసవి ప్రభావంతో విద్యుత్ సర ఫరాలో అంతరాయం తలెత్తుతుండడంతో ఉక్కపోతను తట్టుకోలేక ఉద్యోగులు, సిబ్బంది నానాయాతన అనుభవిస్తున్నారు. వీరికి తోడు పనులపై వచ్చిన ప్రజలు సైతం కరెంటు ఎప్పుడు వస్తుందా అంటూ ఆశగా ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కొద్దిపాటి వర్షానికే బోగోలులో నిలిచిన నీరు



బోగోలు ప్రధాన రోడ్డులో నిలిచి ఉన్న వర్షపునీరు

బిట్రగుంట, జూన్ 6: బోగోలు ప్రధాన రోడ్డుపై కొద్దిపాటి వర్షానికే నీరు నిల్వ చేరడంతో గురువారం పాదచారులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల ప్రధాన నాయకులు ఉంటున్న బోగోలులోనే రోడ్లను పట్టించుకోకపోతే మిగిలిన పంచాయతీల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, ఈవో పీఆర్డీ శ్రీదేవి సంఘటనా స్థలానికి చేరుకొని మోటార్‌తో నీటిని తరలించే చర్యలు చేపట్టారు.

కలిగిరి : మండలంలో గురువారం చిరుజల్లులు పడ్డాయి. ఈ జల్లులతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేదతీరారు. రుతుపవనాలు చురుకుగా కదులుతుండగా ఆకాశం మబ్బులుపట్టి చల్లటి గాలులు వీచాయి.

కూటమి విజయం.. కార్యకర్తల సంబరం



జలదంకిలో ఎన్డీఏ నేతల సంబరాలు



బిట్రగుంటలో మాలేపాటికి సత్కారం



అల్లూరులో బీద గిరిధర్‌కి సన్మానం

అల్లూరు, జూన్ 6 : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో తమతమ నాయకులకు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. అల్లూరు టీడీపీ కార్యాలయంలో గురువారం నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్‌ను మండలంలోని నాయకులు, కార్యకర్తలు కలుసుకొని అభినందనలు తెలిపారు. శాలువాలు, పూలమాలలతో ఆయన్ను సత్కరించారు.

బిట్రగుంట,(దగదర్తి): సమష్టి కృషితోనే విజయం సాధించ గలిగామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. దగదర్తి మండలం కేకేగుంట, సున్నపుబట్టి పంచాయతీలకు చెందిన పలువురు నాయకులు గురువారం మాలేపాటికి పూలమాలలు వేసి శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగళ్ల ఆనంద్, బెల్లంకొండ శ్రీనివాసులు, వల్లపు మల్లికార్జున, హరికృష్ణ, వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : కందుకూరు ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు గెలుపొందడంతో స్థానిక వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, రిటైర్డ్ హెచ్ఎం. కండే మాలకొండయ్య, అర్థాకుల బాబు(వెంకటేశ్వరరావు)ల నేతృత్వంలో అంకమ్మ ఆలయంలో గురువారం 101 కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు గాలంకి ప్రసాద్, అడపా రంగయ్య జి బాలనారాయణ, అడపా కృష్ణ, అర్థాకుల పెదసత్యం, అర్థాకుల చిన సత్యం, మీరావలి తదితరులు కొబ్బరికాయలు కొట్టి, పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ బాలకోటయ్య, సజ్జల మాల్యాద్రి, పెద అంజయ్య, అనిల్, వెంకటేశ్వర్లు చంద్రమౌళి పాల్గొన్నారు.



వలేటివారిపాలెం : అంకమ్మ ఆలయంలో 101 టెంకాయలు కొట్టిన వాల్మీకి సంఘం నాయకులు

జలదంకి : మోదీ, చంద్రబాబు విజయంపై స్థానిక ఎన్డీఏ కూటమి కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు. ముందుగా కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలుగా కాకర్ల సురేష్, కావ్య క్రిష్ణారెడ్డిలు గెలుపొందడం ఆనందంగా ఉందన్నారు. వీరి నాయకత్వంలో జలదంకి మండలం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నేతలు పచ్చా పెంచలయ్యనాయుడు, కంచర్ల వినోద్‌నాయుడు, కోర్శిపాటి మాధవరెడ్డి, చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి, కూరపాటి చిన్నా, నక్కా మాధవరావు, నిమ్మలపల్లి రామ్‌చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కరేడు విద్యార్థుల ప్రతిభ

ఉలవపాడు, జూన్ 6 : కరేడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాని(ఎన్ఎంఎంఎస్)కి ఎంపికైనట్లు హెచ్ఎం పీ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి చదువుతున్న ఆసోది భాను ప్రకాష్‌రెడ్డి, కటారి శ్రీకన్య గత డిసెంబర్‌లో జరిగిన జాతీయ ఉపకార వేతనం పరీక్షలు రాసి ప్రతిభ కనపరిచారని తెలిపారు. వీరికి ఏడాదికి రూ. 12,000 చొప్పున నాలుగేళ్లపాటు ఉపకార వేతనం అందుతుందని పేర్కొన్నారు.వారిని హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బొడ్డు శ్రీధర్‌రెడ్డి, గ్రామస్థులు అభినందించారు.

861 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, జూన్ 6: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 952 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 861బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-29, ఆర్ఆర్-7, సీఆర్-38, జంపింగ్‌లాట్స్-17 కారణాలతో 91బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.331, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.282.30గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కలిగిరి, జూన్ 6: ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ శ్రీను తెలిపారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 11వతేదీలోపు పాఠశాలలో అందజేయాలని ఆయన తెలిపారు.

పేదలకు బిర్యానీ పంపిణీ

కావలిటౌన్, జూన్ 6: మీకోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం బుడమగుంట గిరిజనకాలనీలో పేదలకు చికెన్ బిర్యానీ పొట్లాలు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు రాయపాటి దిలీప్ మాట్లాడుతూ ఎన్ఆర్ఐ కట్టా నోయల్, స్వర్ణలత దంపతుల కుమారుడు అలెన్‌పాల్ పుట్టిన రోజు సందర్భంగా చికెన్ బిర్యానీ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దిహూర్ పీపుల్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చేవూరి చిన్న, సంస్థ బాధ్యులు రవికుమార్, మారుతీరామారావు, నూర్జహాన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిక్షణ



విద్యార్థినికి బహుమతి అందచేస్తున్న దాత

ఉలవపాడు, జూన్ 6 : స్థానిక శాఖా గ్రంథాలయంలో 20 రోజులుగా జరిగిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. ప్రతిరోజు ఆటల పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు దాతల సాయంతో బహుమతులు అందచేశామని చెప్పారు. గ్రంథాలయం స్థల, భవన నిర్మాణ దాత దేవరపల్లి వెంకటక్రిష్ణారెడ్డి జ్ఞాపకార్థం కుమార్తె కోటిరెడ్డి సుచరితారెడ్డి, చింతం కోటిరెడ్డి జ్ఞాపకార్థం మనవుడు చింతం నిషాంత్‌రెడ్డిలు విజేతలకు బహుమతులు అందచేశారని వివరించారు.

వీపీఆర్‌కు కేంద్ర మంత్రి పదవి ఇవ్వాలి

కావలి, జూన్6: సేవాతత్పరుడు అయిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కేంద్ర మంత్రి పదవి ఇవ్వాలని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. వేమిరెడ్డి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నెల్లూరు ఎంపీగా పోటీచేసి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుపొందాడన్నారు. ఎన్డీఏలో భాగస్వామ్యంగా ఉన్న టీడీపీ కేంద్ర మంత్రి వర్గంలో కూడా భాగస్వామ్య కానున్నందున వేమిరెడ్డికి మంత్రి పదవి ఇస్తే జిల్లాతో పాటు రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరికి అభినందనల వెల్లువ



ఎమ్మెల్యే నాగేశ్వరరావును అభినందిస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు, జూన్ 6: కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆయనకు అభినందనలు తెలిపేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పోటీపడుతున్నారు. దీంతో అటు బడేవారిపాలెంలోని ఆయన నివాసం వద్ద ఇటు కందుకూరులోని టీడీపీ కార్యాలయం వద్ద గురువారం తిరునాళ్ల వాతావరణం కనిపించింది. ఉదయం నుంచి వేలాదిమంది పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని వ్యాపారులతోపాటు వివిధరంగాలలో ప్రముఖులు బడేవారిపాలెం వెళ్లి నాగేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాలలో తరలివచ్చిన కార్యకర్తలు, టీడీపీ అభిమానులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. కాగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గట్టమనేని హరిబాబు ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు జొన్నాదుల రాఘవయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు, అమలనాథుని మాల్యాద్రినాయుడు, బొర్రా కోటేశ్వరరావు, జి. మోజెస్, జగన్నాథం వైకుంఠం, మాటూరి రమేష్ నాయుడు తదితరులు నాగేశ్వరరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యమ నేత పొలస్‌కు ఘన నివాళి



పొలస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కందుకూరు, జూన్ 6: బలహీనవర్గాల హక్కుల సాధన, కూలీల సమస్యల పరిష్కారం కోసం తుదిశ్వాస వరకు ఉద్యమించిన నేత పొలస్ అని సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి బీ సురేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం పొలస్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మురళి, ఆనంద్‌మోహన్, రాము, బాలబ్రహ్మచారి, ఉప్పుటూరి మాధవరావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో రెండురోజులుగా మోస్తరు వర్షం

కందుకూరు, జూన్ 6: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి, గురువారం ఉదయం ఓ మోస్తరు జల్లులు పడటంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలలుగా ఎండలతో అల్లాడిపోయిన ప్రజలు చిరుజల్లులతో ఉపశమనం పొందారు. తొలకరి జల్లులతో నేల పదును కానప్పటికీ రానున్న రెండుమూడు రోజులు ఈ ప్రాంతంలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ అంచనాతో భూమి పదునవుతుందన్న ఆశాభావంతో ఉన్నారు. కొన్నేళ్లుగా జూన్ చివరివారం వరకు ఈ ప్రాంతానికి నైరుతి రుతుపవనాలు రాకపోగా ఈ ఏడాది దాదాపు పదిహేను రోజులు ముందుగానే నైరుతి పలకరించటంతో ఈ ఏడాది ఆశాజనకమైన వర్షాలు కురుస్తాయన్న రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో విస్తారంగా సాగుచేసి ఉన్న జామాయిల్, ఇతర సామాజిక వనాలకు ఈ వర్షంతో ఎంతో మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే కొట్టుడుకు వచ్చిన జామాయిల్‌కు కూడా ఈ వర్షాలతో నీరుచేరి లాభం జరుగుతుందన్నారు. మరోవైపు అదునులో తొలకరి జల్లులు కురవడంతో పచ్చిరొట్ట పైర్లు సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

వలేటివారిపాలెంలో కానిరాని పారిశుధ్యం



వలేటివారిపాలెం బీసీ కాలనీ సమీపంలో ప్రధాన రహదారి పక్కన మురుగు కాలువలో పేరుకపోయిన చెత్త

వలేటివారిపాలెం, జూన్ 6 : వలేటివారిపాలెం గ్రామంలో దోమలు విజృంభిస్తున్నాయి. సాయంత్రం అయితే చాలు జనంపై దాడి చేస్తున్నాయి. దోమలు నివారణకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. మురుగు కాలువల్లో చెత్తచెదారం తొలగించడంలేదు. దీంతో మురుగు కాలువల్లో గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగి నీరు ముందుకు కదలడం లేదు. ఫాగింగ్ చేయడం లేదు. దీంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.

● ఫాగింగ్ యంత్రాలు ఉన్నా...

దోమలు నియంత్రణకు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయాలి. లార్వా పెరగకుండా మందులు పిచికారీ చేయాలి. యంత్రాలతో ఫాగింగ్ చేయాలి. దోమలు నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలి.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం



తోటపల్లిగూడూరు: ఎన్టీఆర్ విగ్రహానికి పాలభిషేకం చేస్తున్న టీడీపీ అభిమానులు



కోవూరు : కొత్తూరు దళిత కాలనీలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

తోటపల్లిగూడూరు, జూన్ 6: రాష్ట్ర అభివృద్ధి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ అభిమానులు పేర్కొన్నారు. మండలంలోని పరిషత్ కార్యాలయం సమీపంలోని, దివంగత నందమూరి తారకరామారావు విగ్రహానికి పార్టీ అభిమానుల ఆధ్వర్యంలో గురువారం పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయం, సర్వేపల్లి నియోజకవర్గం నుంచి అధిక మెజారిటీతో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపొందడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్, టీడీపీ వీరాభిమాని పూనమల్లి రామారావు, పూనమల్లి వెంకయ్య, బందెల రాజేష్, మలిశెట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

టీడీపీతోనే పేదల సంక్షేమం

కొడవలూరు: తెలుగుదేశం పార్టీతోనే పేదల సంక్షేమమని టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి అన్నారు. మండలంలో గుండాలమ్మపాళెం గ్రామంలో ఆగ్రామ ప్రజలు టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించారన్నారు. అనంతరం గ్రామంలో మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు.



కొడవలూరు: కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు, అభిమానులు

కోవూరు : టీడీపీ పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంతో గురువారం మండల పరిధిలోని కోవూరు, పడుగుపాడు, పోతిరెడ్డిపాళెం, పాటూరు, మోడేగుంట, చెర్లోపాళెం, లేగుంటపాడు, ఇనమడుగు గ్రామాల్లో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. స్థానిక కొత్తూరు దళిత కాలనీలో టీడీపీ నాయకులు వేమారెడ్డి బాలకృష్ణారెడ్డి, గౌతమ్‌రెడ్డి నాయకత్వంలో భారీ కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉప్పర్తి వేమయ్య, ఉన్నం చంద్రయ్య పాల్గొన్నారు.

చేనేత సంఘం హర్షం

రాష్ట్ర చేనేత సంఘం అధ్యక్షుడు కేవీ శేషయ్య ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సంబరాల్లో చేనేత సంఘం నాయకులు చింతలపూడి పెంచలయ్య, గుత్తికొండ వెంకయ్య, పన్నెం వంశీకృష్ణ, కవర్తపు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వెండి అభిషేక శంకు ధార వితరణ



వెండి అభిషేక శంకుధారను అర్చకునికి అందిస్తున్న అమరా శ్రీరాములు

పొదలకూరు, జూన్ 6: పట్టణంలోని శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారికి మూలమూర్తి అభిషేకమునకు శంకుధార వెండి వసువును మాజీ పెంచలకోన ఆలయ చైర్మన్ అమరా శ్రీరాములుశెట్టి బహూకరించారు. దీని విలువ సుమారు రూ. 80వేలు ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచపూటి ధనుంజయరావు, రామారావు, చాట్ల కోటేశ్వరరావు, కమిటీ మెంబర్లు దేవస్థానం చైర్మన్ బోయిళ్ల మాలకొండరెడ్డి, కమిటీ మెంబర్లు దేవస్థానం అర్చకులు వాకాటి శ్రీనివాసచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డికి టీడీపీ నేతల అభినందనలు



మనుబోలు: సోమిరెడ్డిని సన్మానిస్తున్న అక్కంపేట టీడీపీ నాయకులు

మనుబోలు, జూన్ 6: సర్వేపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గురువారం మండలంలోని పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. అక్కంపేట టీడీపీ నాయకులు దొడ్ల శ్రీనువాసులురెడ్డి, వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు, మనుబోలు నుంచి దండు చంద్రశేఖర్‌రెడ్డి, వినోద్, కొమ్మలపూడి టీడీపీ నాయకులు, మాజీ కనుపూరు కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు, మండల టీడీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ చల్లగిరి చిట్టిబాబు, లింగారెడ్డిపల్లి గ్రామస్థులు సోమిరెడ్డిని సన్మానించారు.

వెంకటాచలం: మండలంలోని ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలు నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న సోమిరెడ్డి కార్యాలయానికి గురువారం వెళ్లి సోమిరెడ్డిని శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అలాగే సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆయన సతీమణి సోమిరెడ్డి శృతిరెడ్డిలను కూడా కలిసి శాలువాలతో సన్మానించారు.

పదోతరగతి విద్యార్థులకు అపస్ అభినందనలు



అభినందన సభలో పాల్గొన్న విద్యార్థులు, ఎంఈవోలు ఉపాధ్యాయులు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 6: మండలంలో 2023-24 సంవత్సరానికి పదోతరగతిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) ఆధ్వర్యంలో గురువారం అభినందించారు. బుచ్చిలోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో అభినందన సభ ఏర్పాటుచేయగా ముఖ్య అతిథులు ఎంఈఓలు దిలీప్‌కుమార్, పీవీ రత్నం మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమిష్టి కృషితోనే మండల స్థాయిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఈ సభలో హెచ్‌ఎం సుజాత, అపస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, ఎం రవి, హజరత్, మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తల కష్టంతోనే సోమిరెడ్డి విజయం : గుమ్మడి



వెంకటాచలం, జూన్ 6: ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కలిసి కష్టపడి పనిచేసినందునే సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అఖండ మెజార్టీతో విజయం సాధించారని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ అన్నారు. వెంకటాచలంలోని ఆపార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలు, అక్రమ కేసులను లెక్క చేయకుండా సోమిరెడ్డి విజయం కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఎన్డీఏ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల్లో వెంకటాచలం మండలానికి ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చుకుందామని, ప్రజా ప్రభుత్వంలో సోమిరెడ్డి ద్వారా మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించుకుందామన్నారు. మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉండి సమస్యల పరిష్కారం దిశగా టీడీపీ అడుగులు వేస్తుందన్నారు.

ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్



మొక్కలు నాటుతున్న ఎస్ఈఐఎల్ అధికారులు

ముత్తుకూరు, జూన్ 6 : ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా పైనంపురం లోని ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈఐఎల్) గురువారం ముసునూరు వారిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి సీహెచ్ రాజశేఖర్, గౌరవ అతిథిగా ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఓఅండ్ఎం హెడ్ సునీల్‌కుమార్ గుప్తా పాల్గొని పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఉత్తమ ప్రమాణాలను అనుసరించడం ద్వారా, వివిధ పర్యావరణ అనుకూల కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఆదర్శంగా నిలుస్తోందని ఏపీపీసీబీ ప్రాంతీయ అధికారి రాజశేఖర్ ప్రశంసించారు. కంపెనీ సీఈవో శ్రీరాఘవ్ త్రివేది మాట్లాడుతూ సామూహిక మొక్కల పెంపకం ద్వారా ప్రకృతి, సమాజానికి మద్దతిస్తామన్నారు. 2015 సంవత్సరం నుంచి 11లక్షలకు పైగా మొక్కలు నాటామన్నారు. వృక్షజాలం, జంతుజాలానికి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థను సృష్టించేందుకు కృషిచేస్తున్నామన్నారు. కంపెనీ హెచ్ఓడీలు, ఉద్యోగులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు.

పీహెచ్‌సీ నిర్మాణం పూర్తిచేయాలి

● జనసేన నేతల ఆందోళన



ఆందోళన చేస్తున్న జనసైనికులు

మనుబోలు, జూన్ 6: గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ వైద్యశాల నిర్మించలేకపోయారంటూ మండల జనసేన అధ్యక్షుడు పెనుబాక ప్రసాద్ అన్నారు. గురువారం మనుబోలులో వర్షం కురవడంతో వర్షపునీరంతా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి చేరింది. దీనిపై జనసైనికులు ఆందోళన చేశారు. పీహెచ్‌సీలో తడిచిన గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో కనీస వసతులు లేక సిబ్బంది, రోగులు అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నత వైద్యాధికారులు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు జాకీర్, సురేష్, సుధాకర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి : పొంగూరు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 6: విశేష ఆదరణతో తిరుగులేని విజయాన్ని అందించిన నెల్లూరు నగర ప్రజల రుణాన్ని తీర్చుకునేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకెళుతూ మరచి పోలేని అభివృద్ధిని అందిస్తానని నగర ఎమ్మెల్యే డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. నగరంలోని గోమతినగర్ క్యాంప్ కార్యాలయంలో యూత్ టీమ్, మహిళా టీమ్, టీడీపీ ముఖ్యనేతలతో గురువారం సాయంత్రం ఆయన సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, పార్టీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షంతో రోడ్లు జలమయం



మనుబోలు: ప్రధాన రోడ్డుపై వర్షపు నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

మనుబోలు, జూన్ 6: మండలంలో గురువారం కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ముఖ్యంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి రోడ్డుపై కురిసిన వర్షపునీరు రావడంతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు. గదుల్లోకి నీరు వెళ్ళడంతో వాటిని బయటకు పంపేందుకు అవస్థలు పడ్డారు. అలాగే పీహెచ్‌సీలో ఉన్న ప్రతి గదిలో బెడ్లు, వైద్యపరికరాలు, మందులు తడిచిపోయాయి. మనుబోలు ప్రధాన రోడ్డుపై కోదండరామపురం వద్ద వర్షపునీరు నిలిచిపోయింది. కాలువల్లో మురుగునీరు రోడ్డుపైకి చేరి ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. జీలగ, నువ్వు, పెసర పైర్లకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు.

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలో గురువారం సాయంత్రం జోరువాన కురిసింది. దీంతో వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు. రైతులు హర్షం వ్యక్తం చేశారు. వర్షం కారణంగా జొన్నవాడ బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులు, వ్యాపారులు ఇబ్బందిపడ్డారు. కాగా, మండలంలో కొన్ని ప్రాంతాల్లో కొద్దిపాటి వర్షం కురిసింది.

కొడవలూరు : మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలలు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతవరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

సంబరాలు.. శుభాకాంక్షలు



బాణసంచా కాలుస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

● ఎన్నికల్లో విజయంతో టీడీపీ శ్రేణుల ఉత్సాహం



నారాయణతో ఏపీఎన్జీవో సంఘం నాయకులు

నెల్లూరు(వైద్యం) జూన్ 6 : సార్వత్రిక ఎన్నికల్లో చారిత్రక విజయంతో టీడీపీ శ్రేణులు సంబరాల పరంపర కొనసాగిస్తున్నాయి. నగరంలోని పలు చోట్ల విజయోత్సవాలు జరుపుకుంటున్నారు. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు, అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. నగరం లోని 14వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ సంబరాలు జరుపుకుంది. గురువారం డివిజన్‌లో ద్రోణాదుల ఎలమందయ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి నేతలు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ మాట్లాడు తూ వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు బంగాళాఖాతంలో కలిపేశారన్నారు. రాష్ట్రానికి జగనాసుర పీడ విరగడైందని చెప్పారు. అభివృద్ధి ప్రదాత నారా యణను నెల్లూరు చరిత్రలోనే అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుభా న్‌బాషా, బీఎల్ఏలు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

నారాయణకు సత్కారం

నగరంలో పొంగూరు నారాయణ అద్భుత విజయం సాధించారని టీవీ నటుడు సింగంశెట్టి మురళీమోహన్‌రావు అన్నారు. గురువారం నారాయణ నివాసంలో బాలయ్య సైన్యం జిల్లా అధ్యక్షుడు ఎద్దల రవితో కలిసి నారాయణను సత్కరించి శుభాకాంక్షలు తెలియచేశారు. మురళీ మాట్లాడుతూ నెల్లూరు నగరం అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నారాయణ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ అభిషేక్, కళాంజలి చక్రవర్తి, కేసీ కృష్ణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీవో నాయకుల శుభాకాంక్షలు

నెల్లూరు(హరనాథపురం): ఎమ్మెల్యేలుగా గెలిచిన పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిని గురువారం వారి క్యాంపు కార్యాలయాలు, నివాసాల్లో ఏపీఎన్జీవో సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్న నారా చంద్రబాబు నాయుడికి, జిల్లాలో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు బందారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, అసోసియేట్ అధ్యక్షుడు అంజనేయవర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామకృష్ణ, కరుణమ్మ, శ్రీధర్ పాల్గొన్నారు.

కూటమి విజయం చరిత్రాత్మకం



సోమిరెడ్డిని సత్కరిస్తున్న జనసేన పార్టీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఎన్డీఏ కూటమి విజయం చరిత్రాత్మకమని జనసేన పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ అన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామ నారాయణరెడ్డిని గురువారం ఆయన కలిసి సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కృష్ణారెడ్డి, రవి, గుర్రం కిషోర్ పాల్గొన్నారు.

నెల్లూరు రూపు రేఖలు మారుద్దాం : నారాయణ



కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నారాయణ

నెల్లూరు(వ్యవసాయం): ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు నెల్లూరు నగర రూపురేఖలు మారుద్దామని నగర ఎమ్మెల్యే పొంగూరు నారాయణ అన్నారు. బాలాజీనగర్‌లో ఉన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నివాసానికి గురువారం నారాయణ వెళ్లారు. నగర నియోజకవర్గంలో భారీ మెజారిటీ వచ్చేందుకు ఎంతో కష్టపడ్డారని, ఐదేళ్ల కార్యకర్తలని కాపాడారంటూ కోటంరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. అనంతరం పలు అంశాలపై వారు చర్చించుకున్నారు. అందరం ఐక్యంగా ఉంటూ నెల్లూరు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దామన్నారు.



ఉండవల్లిలో చంద్రబాబును కలిసిన టీడీపీ నేత పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

శభాష్ అజీజ్ భాయ్

● లోకేష్ అభినందన



నెల్లూరు(వైద్యం), జూన్ 6 : కష్టపడి పనిచేశారు... మీ కష్టం వృథా పోదు అంటూ తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ను పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రశంసించారు. గురువారం అజీజ్ విజయవాడలో నారా లోకేష్‌ను కలిశారు. ఎన్నికల్లో విజయం సాధించినందుకు పుష్పగుచ్ఛం అందించి ఆనందం వ్యక్తం చేశారు. లోకేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి నేతలు, కార్యకర్తలు చాలా కష్టపడి పనిచేశారని, వారి కష్టం వృథా పోదని భరోసా ఇచ్చారు.

రేపటి నుంచి జనసేన విజయోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం): దేశంలోనే నూటికి నూరు శాతం సీట్లు గెలుపొంది జనసేన పార్టీ రికార్డు నెలకొల్పిందని ఆ పార్టీ నాయకుడు పోతురాజు టోనీబాబు తెలిపారు. శుక్రవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో అఖండ విజయం సాధించినందుకు శనివారం నుంచి మూడు రోజులు విజయోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. శనివారం అన్నదానం, 9వతేదీ రక్తదాన శిబిరం, 10వతేదీన స్కూటర్ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. 3నెలల క్రితం ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో జనసైనికులు విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాన్వాజ్, అలీ, షఫీ, కాకి శివ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి : డీసీవో గురప్ప



మొక్కలు నాటుతున్న డీసీవో గురప్ప, కార్యాలయ సిబ్బంది

నెల్లూరు (హరనాథపురం), జూన్ 6 : పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని జిల్లా సహకారశాఖాధికారిగా బీ గురప్ప పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని ఖజానా కార్యాలయం ఎదుట గురువారం అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యత-శ్రేయస్సు దృష్ట్యా ప్రతి సహకార సంఘంలో విరివిగా మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో పడుగుపాడు పీఏసీఎస్ సీఈవో గోవర్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వీఆర్ లత, ఎం ఉష, ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ రసూల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

డీఏ, పీఎఫ్ బకాయిలు చెల్లించాలి

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 6 : ప్రభుత్వ పింఛనుదారులకు పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కే ఖాసిం, కార్యదర్శి ఎస్ఎన్‌వీ మూర్తిలు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తెలుగుదేశం కూటమికి నెల్లూరు శాఖ తరపున అభినందనలు తెలిపారు. పెన్షనర్లకి ప్రతి నెల 1వతేదీనే పింఛను ఇవ్వాలని కోరారు. 12వ పీఆర్సీ ప్రకటించి న్యాయమైన ఫిట్‌మెంట్ నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు.

వెంకటేశ్వరపురంలో అగ్ని ప్రమాదం

● ఐదు పూరిళ్లు, దుకాణం దగ్ధం



మంటలతో దెబ్బతిన్న ఇల్లు

నెల్లూరు(క్రైం), జూన్ 6: నగరంలోని వెంకటేశ్వరపురంలో బుధవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. క్షణాల్లో ఐదు పూరిళ్లు మంటల్లో చిక్కుకున్నాయి. వేసవి కాలం కావడంతో ఆ ఇళ్లలో నివసించేవారు ఆరు బయట నిద్రించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారం మేరకు.. వెంకటేశ్వరపురంలోని నార్త్ పెన్నాబ్రిడ్జి ప్రాంతంలో బుట్టలు అల్లుకుంటూ 40 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. బుధవారం అర్ధ రాత్రి ఒంటి గంట పైన రవి, శేఖర్, గణపతి, సుబ్బమ్మ ఇళ్లకు మంటలు అంటుకున్నాయి. బయట నిద్రిస్తున్న ఆ కుటుంబాల సభ్యులు మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడటం ఉలిక్కిపడి లేచారు. మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తుం డగా రెండిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మరో మూడిళ్లు పాక్షికంగా తగలబడ్డాయి. ఈ మంటలను ఆర్పే సమయంలోనే వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ వంతెన కింద ఉన్న పరుపులు, వెదురు గంపలు, వస్తువులు, కర్రల దుకాణానికి మంటలు వ్యాపించడంతో అవి కూడా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఎవరో పొగతాగి ఆ పీకలు వేయడం వల్లే ప్రమాదం జరిగినట్లు ఫైర్ సిబ్బంది భావిస్తున్నారు. కానీ, స్థానికులు మాత్రం ఎవరో కావాలనే ఇళ్లు తగలబెట్టినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ మేరు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నేడు పుష్పయాగం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 6 : నగరంలోని మహాత్మాగాంధీ నగర్ కృష్ణమందిరంలో శుక్రవారం సాయంత్రం 7గంటలకు పుష్పయాగం, పుష్పార్చన జరుగుతాయని మందిరం పాలకవర్గం ఓ ప్రకటనలో పేర్కొంది. మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపింది. భక్తులందరూ తరలిరావాలని కోరింది.

ఎస్పీబీ సేవాసమితి అన్నదానం

నెల్లూరు (విద్య), జూన్ 6 : గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతి సందర్భంగా ఎస్పీబీ సేవాసమితి ఆధ్వర్యంలో నిరుపేద పిల్లలకు గురువారం అన్నదానం చేశారు. నగరంలోని ప్రగతి చారిటీస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సేవాసమితి జిల్లా అధ్యక్షుడు, గాయకుడు కేవై దయా మాట్లాడుతూ సంగీత రంగంలో విశేష సేవలందించిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నెల్లూరీయుడు కావడం గర్వంగా ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో తమ సేవాసమితి తరపున సంగీతాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆస్ట్రేలియాకు చెందిన కే ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సబిత అన్నదానానికి సహకరించారని చెప్పారు. కార్యక్రమంలో వెంకన్నయాదవ్, సందానీ, వేణు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు రాయితీలు పునరుద్ధరించాలి

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 6 : కళాకారులు, రచయితలు నిస్వార్థంగా సమాజ సేవ చేస్తారని, గత ప్రభుత్వంలో కళాకారులకు నిలిచిపోయిన అన్ని రాయితీలు పునరుద్ధరించాలని పలువురు కవులు, కళాకారులు నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయం సాధించినందుకు గురువారం నగరంలోని నర్తకి సెంటర్‌లో అభినందన సభ నిర్వహించారు. నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఏ జయప్రకాష్, టీవీ నటుడు మురళీమోహన్‌రావు, కేతా సుబ్బారావు, అరవ రాయప్ప మాట్లాడుతూ సమాజ చైతన్యానికి, దేశ ప్రగతికి కళాకారులు పట్టుకొమ్మలన్నారు. వారికి ప్రభుత్వపరంగా గుర్తింపు కార్డులు, వృద్ధాప్య పింఛన్లు, ఇంటి స్థలాలు, బీమా, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు పాటూరి శ్రీనివాసులు, ఇంద్రజాలికుడు రాయల్ తదితరులు పాల్గొన్నారు.



పొలాల్లో ఆరుద్ర పురుగుల సంచారం

ఖరీఫ్ సీజన్ ప్రారంభం

సకాలంలో రుతు పవనాలు ఆగమించాయి. ఖరీఫ్ సాగు ఆరుద్ర కార్తెతో ప్రారంభమవబోతోంది.ఇందుకు చిహ్నంగా ఆరుద్ర పురుగులు పొలాల్లో దర్శనమిస్తున్నాయి. పొలాలు దుక్కి దున్ని ఆరుద్ర కార్తె ప్రారంభానికి రైతులు సాగు పనులకు శ్రీకారం చుడతారు.కారణం ఆరుద్ర కార్తెలో వేసిన విత్తనాలకు మంచి పంట దిగుబడి వస్తుంది. అదునుకు సాగు చేయడంలోనే పంట దిగు బడి ఆధార పడి ఉంటుంది. ఖరీఫ్ అదును వచ్చేసిందని తెలియజెప్పేందుకు ఆరుద్ర పురుగులు వారం నుంచీ పక్షం రోజుల వరకూ పొలాల్లో సంచరిస్తూ రైతన్నను సాగుకు ప్రోత్సహిస్తుంటాయి.అయితే ప్రస్తుత ఆధునిక వ్యవసాయంతో నేల విష రసాయనాలతో కలుషితం కావడంతో ఆరుద్ర పురుగు ఉనికే కనుమరుగవుతుండడం విషాదం.

- ఎర్రావారిపాలెం


జిల్లావ్యాప్తంగా వర్షాలు

తిరుపతి(కలెక్టరేట్),జూన్ 6: జిల్లావ్యాప్తంగా గురువారం వర్షాలు కురిశాయి. ఎండ వేడిమికి అల్లాడిన జనానం వర్షంతో కాస్త ఉపశమనం పొందారు.మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.గురువారం ఉదయం ఎనిమిది గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. అత్యధికంగా వడమాలపేటలో 84.4మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. తిరుపతి అర్బన్‌లో 68.2, సూళ్లూరుపేటలో 55.4, నారాయణవనంలో 52.8, దొరవారిసత్రంలో 43.6, కేవీబీపురంలో 40.4, తిరుపతి రూరల్‌లో 36.2, రామచంద్రాపురంలో 34.2, పుత్తూరులో 33.8, బాలాయపల్లిలో 33.8, రేణిగుంటలో 32.4, గూడూరులో 32.2, చిన్నగొట్టిగల్లులో 29.8, పెళ్లకూరులో 26.4, చంద్రగిరిలో 22.2, పిచ్చాటూరులో 21.4, వాకాడులో 20.4, ఎర్రావారిపాళెంలో 20.4, ఓజిలిలో 17.6, చిట్టమూరులో 15.8 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.

నైరుతురాగాలు















ఎండ వేడి.. ఎన్నికల వేడి.. రెండూ చల్లబడ్డాయి. కనిపించని మేఘాలు ఈవీఎం పెట్టెల్లో కురిపించిన ఓట్లవాన వెల్లువై అరాచకపాలన అంతమైపోగా, కమ్ముకొచ్చిన కారుమబ్బులు కుండపోతగా మారి పుడమి తల్లి దాహం తీరుస్తున్నాయి. శిఖరాలతో ఊసులాడి, అడవిని ముద్దాడి తేలాడుతున్న మబ్బులు ఉండి ఉండీ కురిపిస్తున్న జల్లులతో తిరుమల కొండలు కొత్త అందాలను సంతరించుకున్నాయి. శ్రీనివాసుడి దర్శనం కోసం వస్తున్న భక్తులకు మనోల్లాసం కలిగిస్తున్నాయి. ముసురు వానల్లో తడిసి మురుస్తున్న చెట్టూ చేమతో పాటూ జనజీవన సౌందర్యం చూసి ప్రకృతి పులకిస్తోంది. గురువారం నాటి కొన్ని వాన అందాల చిత్రాలు ఇవి..













టీడీపీకి పూర్వవైభవం

కూటమికిది చరిత్రాత్మక విజయం

ఎన్టీఆర్ నాటి ప్రభంజనాలకు చేరువైన పార్టీ



తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో టీడీపీ కూటమి చరిత్రాత్మక విజయం నమోదు చేసింది. సూటిగా చెప్పాలంటే పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు నాటి ప్రభంజనాలకు ఈసారి టీడీపీ కూటమి చేరువగా వచ్చింది. మొత్తం 14 అసెంబ్లీ స్థానాలకు గానూ 12 స్థానాలను కూటమి గెలుచుకుంది. దీనితో పాటు చిత్తూరు ఎంపీ సీటు దక్కించుకుని జిల్లాలో పూర్వ వైభవాన్ని సాధించింది. టీడీపీ ఆవిర్భవించాక 1983లో జరిగిన తొలి ఎన్నికల్లో అప్పటికి 15 అసెంబ్లీ స్థానాలున్న ఉమ్మడి జిల్లాలో ఏకంగా 14 స్థానాలను గెలుచుకుని చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. అప్పట్లో తంబళ్ళపల్లె మినహా మదనపల్లె, వాయల్పాడు, పీలేరు, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి, పుత్తూరు, వేపంజేరి, చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు అసెంబ్లీ స్థానాలలో ఎన్టీఆర్ ప్రభంజనంతో టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. అలాగే అప్పట్లో జిల్లాకు సంబంధించి చిత్తూరు, తిరుపతి, రాజంపేట ఎంపీ స్థానాలను కూడా కైవసం చేసుకుంది.ఆ తరహా ప్రభంజనాన్ని టీడీపీ మళ్ళీ 1994లో ప్రదర్శించింది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో మొత్తం 15 అసెంబ్లీ స్థానాలకు చిత్తూరు మినహా 14 స్థానాలనూ గెలుచుకుంది. చిత్తూరులో సీకే బాబు స్వల్ప ఆధిక్యతతో గెలిచి కాంగ్రెస్ ఉనికి కాపాడారు. తర్వాతెప్పుడూ జిల్లాలో టీడీపీ మెజారిటీ స్థానాలు సాధించింది లేదు. చివరికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా వుండగా జరిగిన 1999, 2004 ఎన్నికల్లో కూడా మెజారిటీ స్థానాలు కాంగ్రెస్‌కే దక్కాయి. ఇక 2014 ఎన్నికల్లో టీడీపీ గెలిచి చంద్రబాబు మళ్ళీ సీఎం అయినప్పటికీ జిల్లాలో మాత్రం యధాప్రకారం ప్రతిపక్షమైన వైసీపీకే అత్యధికంగా ఎనిమిది సీట్లు దక్కాయి. ఇక 2019 ఎన్నికల్లో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలకు గానూ టీడీపీకి కుప్పం ఒక్కటే దక్కింది. మిగిలిన 13 సీట్లూ వైసీపీ పరమయ్యాయి. తాజా ఎన్నికల్లో టీడీపీ మళ్ళీ ప్రభంజనం సృష్టించింది. 14 స్థానాల్లో రెండు మినహా 12 స్థానాలూ టీడీపీ స్వీప్ చేసింది. చిత్తూరు ఎంపీ సీటు కూడా కైవసం చేసుకుంది. పుంగనూరు, తంబళ్ళపల్లె సెగ్మెంట్లను కూడా స్వల్ప తేడాతోనే కోల్పోయింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమీక్ష

సెగ్మెంట్	2014 టీడీపీ ఓట్లు	2014 వైసీపీ ఓట్లు	విజేత ఆధిక్యత	2019 టీడీపీ ఓట్లు	2019 వైసీపీ ఓట్లు	విజేత ఆధిక్యత	2024 టీడీపీ ఓట్లు	2024 వైసీపీ ఓట్లు	విజేత ఆధిక్యత
తంబళ్ళపల్లి	82090	72900	9190టీ	58506	105444	46938వై	84033	94136	10103వై
పీలేరు	33857	71949	38092వై	79426	87300	7874వై	105582	80501	25081టీ
మదనపల్లె	64663(టీడీపీ-బీజేపీ)	81252	16589వై	62418	92066	29648వై	97980	92471	5509టీ
పుంగనూరు	72856	104587	31731వై	63876	107431	43555వై	94968	100793	6095వై
చంద్రగిరి	96406	100924	4518వై	86035	127790	41755వై	143667	99815	43852టీ
తిరుపతి	99313	57774	41539టీ	79836	80544	00708వై	124107(కూటమి)	62151	61956జే
శ్రీకాళహస్తి	89953	82370	7583టీ	71400	109541	38141వై	121565	78261	43304టీ
సత్యవేడు	77655	73428	4227టీ	59197	103941	44744వై	85471	81732	3739టీ
నగరి	73866	74724	858వై	77625	80333	2708వై	107797	62793	45004టీ
జీడీనెల్లూరు	63973	84538	20565వై	57444	102356	44912వై	101176	75165	26011టీ
చిత్తూరు	73430	66631	6799టీ	51238	91206	39968వై	88066	73462	14604టీ
పూతలపట్టు	82298	83200	902వై	74102	103265	29163వై	102137	86503	15634టీ
పలమనేరు	93651	96541	2890వై	87625	119241	31616వై	123232	103110	20122టీ
కుప్పం	102952	55831	47121టీ	100146	69424	30722టీ	121929	73923	48006టీ
మొత్తం	11,06,963	11,06,649	314టీ	10,08,874	13,79,882	3,71,008వై	15,01,710	11,64,846	3,36,864టీ

అభ్యర్థులు సైతం ఊహించని భారీ ఆధిక్యతలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి తాజా ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు చాలావరకూ భారీ ఆధిక్యతలు సాధించారు. తిరుపతిలో కూటమి తరపున జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అత్యధికంగా 61 వేలకు పైగా మెజారిటీ తెచ్చుకోగా కుప్పంలో చంద్రబాబుకు 48 వేలకు పైగా, నగరిలో గాలి భానుప్రకాష్‌కు 45 వేలకు పైగా, చంద్రగిరి, శ్రీకాళహస్తిల్లో పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి 43 వేలకు పైగా ఆధిక్యత సాధించారు. జీడీనెల్లూరులో థామస్ 26 వేలకు పైగా, పీలేరులో నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి 25 వేలకు పైగా మెజారిటీ దక్కించుకున్నారు.పలమనేరులో అమరనాథరెడ్డి 20 వేలకు పైగా, పూతలపట్టులో మురళీమోహన్ 15 వేలకు పైగా, చిత్తూరులో జగన్మోహన్ 14 వేలకు పైగా ఆధిక్యత పొందారు. మదనపల్లెలో షాజహాన్ 5 వేలకు పైగా, సత్యవేడులో ఆదిమూలం 3 వేలకు పైగా తేడాతో గెలుపొందగా వీరిద్దరి ఆధిక్యతే తక్కువ. ఈ రెండు చోట్ల మినహా 10 స్థానాల్లో ఇంత భారీ మెజారిటీలను గెలిచిన అభ్యర్థులు కూడా ఊహించలేదు.

సాధారణ మెజారిటీలను రెట్టింపు చేసిన స్థానిక పరిస్థితులు

వైసీపీ ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకత కారణంగా పలువురు టీడీపీ అభ్యర్థులకు సాధారణ మెజారిటీ రాగా కొన్ని చోట్ల స్థానిక పరిస్థితులు మెజారిటీలను అమాంతం పెంచేశాయి. ఉదాహరణకు తిరుపతి సీటునే తీసుకుంటే స్థానికేతరుడైన ఆరణి శ్రీనివాసులు గెలుపు కష్టమని పలువురు భావించారు. అందునా చిత్తూరులో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా వుండి హఠాత్తుగా తిరుపతిలో జనసేన అభ్యర్థిగా బరిలోకి దిగడంతో తిరుపతిలోని టీడీపీ, జనసేన శ్రేణులు తొలుత సహకరించలేదు. అయితే ఇక్కడ అధికార పార్టీ నేతల తీరు, వ్యవహారశైలి పట్ల జనంలో నెలకొన్న తీవ్ర వ్యతిరేకత కూటమి అభ్యర్థి మెజారిటీలో ప్రతిఫలించింది. శ్రీకాళహస్తిలోనూ ఇదే పరిస్థితి. వైసీపీ అభ్యర్థిపై తీవ్ర స్థాయి అవినీతి ఆరోపణలు ప్రచారంలో వుండడం ప్రజల్లో ఆయన పట్ల వ్యతిరేకతను విపరీతంగా పెంచేసింది. దానివల్లే టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌కు భారీ మెజారిటీ వచ్చిందని పలువురు భావిస్తున్నారు. నగరిలోనూ వైసీపీ అభ్యర్థి రోజా మీద అవినీతి ఆరోపణలకు సొంత పార్టీలో నేతల వ్యతిరేకత తోడు కావడంతో టీడీపీ అభ్యర్థి గాలి భానుకు అనూహ్య మెజారిటీ వచ్చింది. భాను గెలుస్తారని అన్ని వర్గాలూ ముందుగానే నిశ్చితాభిప్రాయానికి వచ్చినా ఈ మెజారిటీని ఎవరూ అంచనా వేయలేదు.చంద్రగిరిలో పదేళ్ళ పాటు ఎమ్మెల్యేగా వున్న చెవిరెడ్డి భాస్కర రెడ్డిపై వ్యతిరేకత ప్రబలింది. సొంత పార్టీలోనూ నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి ప్రబలింది. కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు విస్తృతంగా ప్రచారమయ్యాయి. అయినా టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ స్వల్ప మెజారిటీతో గట్టెక్కుతారని సొంత పార్టీ వర్గాలే భావించాయి. కానీ అభ్యర్థి కూడా ఊహించని రీతిలో 43 వేలకు పైగా మెజారిటీ రావడం సంచలనం రేపుతోంది.పీలేరులో కూడా నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి గెలుస్తారని అందరూ భావించినా పాతిక వేల మెజారిటీ ఊహించలేదు. చాలా నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు సాధించిన మెజారిటీలు రికార్డు సృష్టించాయంటే అతిశయోక్తి కాదు. మొత్తం మీద అనూహ్య ఆధిక్యతలతో జిల్లావ్యాప్తంగా టీడీపీ శ్రేణులు సంబరపడిపోతున్నాయి.



ముఖేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతిలో సీఈవో

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం సాయంత్రం తిరుపతికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం అందజేశారు. శుక్రవారం ఉదయం కుటుంబ సమేతంగా ముఖేష్‌కుమార్‌మీనా తిరుమల శ్రీవారిని దర్శించుకుని విజయవాడకు తిరుగుప్రయాణం కానున్నారని జిల్లా అధికారులు తెలిపారు.

తుమ్మలగుంట చెరువులో హడావుడి నిర్మాణాలు

- ఎన్జీటీ అభ్యంతరాలున్నా మారని తీరు

తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెరువులో హడావుడిగా నిర్మాణాలు జరుగుతుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏవియేషన్ అనుమతులు లేకుండా చెరువులో నెలరోజుల క్రితం భారీ ఎత్తున ఏర్పాటు చేసిన జాతీయ పతాకం కోసం ఐప్యాక్ టీం హెడ్ చేతుల మీదుగా భూమిపూజ చేశారని విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పతాకాన్ని తీసి.. పక్కన పెట్టినట్టు తెలిసింది. అయితే ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పతాక స్తంభం చుట్టూ నిర్మాణాలు జరుగుతున్నాయి. తుమ్మలగుంట చెరువు అన్యాక్రాంతమవుతోందని పలువురు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) సీరియస్ అయిన విషయం తెలిసిందే. ఒకవైపు ఎన్జీటీ అభ్యంతరాలు, మరోవైపు కొత్త ప్రభుత్వం ఏర్పాటు నేపథ్యంలోనూ తుమ్మలగుంట చెరువులో నిర్మాణాలు ఆగకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ముగిసిన ఎన్నికల కోడ్

సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెడతాం: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6: జిల్లాలో సుమారు మూడు నెలలుగా అమల్లో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి గురువారంతో ముగిసింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న షెడ్యూల్ ప్రకటించడంతో అప్పటి నుంచి ఎన్నికలకోడ్ అమల్లోకి వచ్చింది. తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటం, నామినేషన్లు, పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇవన్నీ విజయవంతంగా నిర్వహించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో శుక్రవారం నుంచి ఇక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించనుందని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు అర్బన్, జూన్ 6: పట్టణంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం 4గంటల నుంచి 40 నిమషాలపాటూ ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఈ సమయంలో విద్యుత్‌అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వర్షం కారణంగా పట్టణంలోని ఆర్టీసీరోడ్డు, కుమ్మరవీధి, త్యాగరాజవీధి, మసీదువీధి తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా వాతావరణం చల్లబడింది.

వెంకటగిరి టౌన్ : పట్టణంలోని గురువారం మోస్తరు వర్షం పడింది. గురువారం వేకువజామున కూడా వర్షం పలసగా కురవడంతో ప్రజలు, రైతులు ఊరట చెందారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో మబ్బులు కమ్ముకోవడంతో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అరాచక పాలనకు చరమగీతం : పాశిం



ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

గూడూరు, జూన్ 6: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు ఈ ఎన్నికలలో ప్రజలు చరమగీతం పాడారని ఎమ్మెల్యేగా గెలుపొందిన టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం పలువురు నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు వైసీపీ పాలనతో విసిగిపోయి కూటమికి అత్యధిక విజయాన్ని అందించారన్నారు. ఇచ్చిన హామీలను చంద్రబాబు తప్పకుండా నెరవేరుస్తారన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలి



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జనార్ధన్‌రెడ్డి

గూడూరు, జూన్ 6: వేసవి శిక్షణా శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని డాక్టర్ జనార్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గూడూరు క్రికెట్‌క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరుజిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో నెలరోజులపాటు నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రెటరీ మునిగిరీష్, లవకుమార్, జుల్కర్, నాగేశ్వరరావు, మధ, సుబ్రమణ్యం, విజయ్‌కుమార్, మహేష్, పూర్ణచంద్, సుధా, పవన్‌సాయి పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి నగదు మాయం

తడ, జూన్ 6 : ఏటీఎం కార్డులో బ్యాలెన్స్ చూసిపెట్టు అని అడిగిన దానికి అతని కార్డును మార్చివేసి 10వేల రూపాయలను ఓ వ్యక్తి మాయం చేశాడు. మండల పరిధిలోని రామాపురం కుప్పం గ్రామానికి చెందిన పి. దేశప్పన్ బుధవారం తన బ్యాంక్ అకౌంట్‌లో బ్యాలెన్స్ వివరాలను తెలుసుకునేందుకు స్థానిక సిండికేట్ బ్యాంక్ ఏటీఎంలోకి వెళ్లాడు. అక్కడే ఉన్న ఓ వ్యక్తిని బ్యాలెన్స్ ఎంత ఉందో చూసిపెట్టాలంటూ ఏటీఎం కార్డు ఇచ్చి పిన్ నెంబరు చెప్పాడు. రూ.10,025 ఉన్నాయంటూ చెబుతూ ఏటీఎం కార్డును మార్చి అతడికి ఇచ్చేశాడు. ఆ తరువాత దేశప్పన్ ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి సమయంలో ఫోన్ చూసుకోగా అప్పటికే బ్యాంక్‌లో 25 రూపాయలు బ్యాలెన్స్ ఉన్నట్లుగా మెసేజ్ ఉండడంతో ఖంగుతిన్నాడు. గురువారం నేరుగా బ్యాంక్‌కు వచ్చి అధికారులకు పరిస్థితిని వివరించి విషయం తెలుసుకోగా 10వేల రూపాయలు ఏటీఎం ద్వారా డ్రా చేసినట్లుగా గుర్తించారు. సదరు వ్యక్తి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ విద్యుత్ కంచె తగిలి ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్, జూన్6 : మండలంలోని శ్రీనివాసపురం సమీపంలో విద్యుత్ కంచె తగిలి ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు... శ్రీనివాసపురం గిరిజన కాలనీకి చెందిన అంకయ్య, వెంకటేశ్వర్లు గురువారం ఉదయం చేపల వేట కోసం బయలుదేరారు. కొంత దూరం వెళ్లిన తరువాత గుర్తుతెలియని వ్యక్తులు అడవి పందుల కోసం 11 కేవీ లైన్ నుంచి విద్యుత్ తీగలు లాగి కంచె ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆ విద్యుత్ కంచెకు వెంకటేశ్వర్లు, అంకయ్య తగలడంతో గాయపడ్డారు. అదే సమయంలో విద్యుత్ ట్రిప్ అయింది. కాలనీవాసులు గమనించి గాయపడ్డ వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ గోపీ, విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ విద్యుత్ కంచె ఏర్పాటు చేసిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టబోతున్నట్లు తెలిపారు.

హామీలను నూరు శాతం అమలు చేసేందుకు కృషి : కురుగొండ్ల



టీడీపీ శ్రేణులతో కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 6: రాజకీయ ఉద్దండులకు కూడా మూడోసారి అవకాశం ఇవ్వని వెంకటగిరి ప్రజలు తనకు ఇచ్చారని కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ వెంకటగిరి ప్రజలు తనపై పెట్టు కొన్న నమ్మకాన్ని వమ్ముచేయనన్నారు. అభివృద్ధి, సంక్షేమం తనకు రెండు కళ్లన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసేందుకు తన శక్తి వంచనలేకుండా కృషి చేస్తానన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనని, ప్రతిపక్ష నాయకులను శత్రువులుగా బావించకుండా వారి సలహాలు, సూచనలను తీసుకొని ముందుకు పోతానన్నారు. తన తప్పులను ప్రతిపక్ష నాయకులు ఎత్తి చూపితే వాటిని సరిచేసుకుంటానన్నారు. కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, సింగంశెట్టి బాస్కర్, బీరం రాజేశ్వరం, కేవీకే ప్రసాద్ నాయుడు, గొల్లగుంట మురళీ, కాపా శ్రీనివాసులు నాయుడు, ఏల్లేశ్వరం రామచంద్రయ్య, పునుగోటి విశ్వనాధనాయుడు, శాంతారావు, నల్లబోతుల మురళి, రమణారెడ్డి, మంకు ఆనంద్ పాల్గొన్నారు.

చిల్లకూరులో టీడీపీ విజయోత్సవ ర్యాలీ

చిల్లకూరు, జూన్ 6: చిల్లకూరులో గురువారం టీడీపీ నాయకుడు తానంకి నానాజీ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా పేల్చుతూ ఓటర్లకు అభివాదం చేస్తూ టీడీపీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తానంకి నానాజీ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరిస్తూ, నియోజకవర్గ అభివృద్ధిని ఆకాంక్షించే పాశిం సునీల్‌కుమార్‌కు ప్రజలు పట్టం కట్టారన్నారు. అనంతరం దుర్గమ్మ, దేశమ్మ, రాజరాజేశ్వరిదేవి, గంగమ్మ, మాతమ్మ, సుందరమ్మ, అభయ కోదండరాస్వామి ఆలయాల్లో టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాము, తానంకి సతీష్, బెల్లకొండ మల్లికార్జున్, నవీన్‌చంద్ర, అశోక్, జగదీష్, వినోద్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు సన్మానం

పెళ్లకూరు, జూన్ 6 : టీడీపీ విజయం కోసం రాత్రి పగలు కష్టపడి పనిచేసిన ఆ పార్టీ కార్య కర్తలు రమేష్, వెంకటేష్‌లకు టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు కన్నలి వాసు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి బంగారు ఉంగరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ కోర్సుల్లో అడ్మిషన్లు

వెంకటగిరి టౌన్/వెంకటగిరి, జూన్6: విశ్వోదయ ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ఇంటర్మీడియట్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈహెచ్‌తోపాటు ఒకేషనల్ బీఅండ్‌ఆర్ఎం, ఎంఎల్‌టీ, ఈటీ గ్రూపులకు అడ్మిషన్స్ జరుగుతున్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

నాయుడుపేట టౌన్, జూన్6 : నాయుడుపేట మల్లాం కూడలి సమీపంలో లారీ ఢీ కొన్న ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ...మల్లాం జంక్షన్ ప్రాంతంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో ఆ వ్యక్తి తల పూర్తిగా నలిగిపోయింది. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయసు 50 ఏళ్లు ఉంటుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

సూళ్లూరుపేట, జూన్ 6: సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జేకేసీ, అవంతి లెదర్ కంపెనీ వారు జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 50మంది హాజరుకాగా వారిలో 28మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ తెలిపారు. కార్యక్రమంలో అవంతి లెదర్ కంపెనీ సీఈవో పాల్, జనరల్ మేనేజర్ లీలాకృష్ణ, హెచ్‌ఆర్ గణేష్, జేకేసీ కో ఆర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

10న కౌన్సిల్ సమావేశం

సూళ్లూరుపేట, జూన్ 6: సూళ్లూరుపేట మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 10న గాండ్లవీధిలోని స్త్రీశక్తి భవనంలో చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ చెల్లు గంగాప్రసాద్ తెలిపారు. ఈ సమావేశానికి వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పకుండా హాజరుకావాలని పేర్కొన్నారు.

సోమిరెడ్డికి సన్మానం



నాయుడుపేట టౌన్, జూన్ 6 : సర్వేపల్లి నుంచి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో నాయుడుపేటకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ కాలేషా ఆధ్వర్యంలో గురువారం నెల్లూరులో ఆయనను సన్మానించారు. సన్మానించిన వారిలో అంజయ్య, రమణమూర్తి తదితరులు ఉన్నారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు అర్బన్, జూన్ 6: స్థానిక ఏరియా ఆసుపత్రిలో గురువారం ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో డాక్టర్లు జనార్ధన్‌రెడ్డి, రోహిణిల దాతృత్వంతో రోగులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ షరీనా, కడివేటి చంద్రశేఖర్, జీ చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము, కుమార్, నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

వెంకటగిరిటౌన్, జూన్ 6: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌లో తన ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ తులసీజ్యోతి తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు స్కాలర్‌షిప్ కోసం విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాశారని తెలిపారు. ఈ పరీక్షల్లో వెంకటనాగసాయి సుందన, రక్షిత, మునిజష్విత, గీతిక, ముని పూజిత, వెన్నెల, గౌతమ్‌ల ప్రతిభ చాటారని అన్నారు. వీరికి ప్రభుత్వం ప్రతి నెలా రూ. 12వేలు అందజేస్తుందన్నారు.

నాడు-నేడు పనుల తనిఖీలు

కోట, జూన్ 6 : మండల పరిధిలోని గూడలి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను గురువారం ఎంఈవో దారా మస్తానయ్య తనిఖీ చేశారు. ఇక్కడ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కింద అదనపు గదుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఎంఈవో మస్తానయ్య, హెచ్ఎం వెంకటేశ్వర్లు పనులను స్వయంగా పర్యవేక్షించి పనులలో నాణ్యత లోపించకుండా చేయాలన్నారు.

సత్యకుమార్‌కు సన్మానం



నాయుడుపేట, జూన్ 6 : ధర్మవరం బీజేపీ ఎమ్మెల్యేగా విజయం సాధించిన వై.సత్యకుమార్‌ను గురువారం విజయవాడలో నాయుడుపేట బీజేపీ నాయకులు శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఆంధ్రరాష్ట్రంలో ఎన్డీఏ కూటమి భారీ మెజార్టీ రావడం ప్రజలకు ఎన్డీఏ పట్ల ఉన్న విశ్వసనీయత తేటతెల్లమైందని అన్నారు. సత్యకుమార్‌ను అభినందించిన వారిలో బీజేపీ నాయకులు బొల్లకాయల విజయభాస్కర్, ఆశా చెంచు కృష్ణయ్య, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

ఆనం, సోమిరెడ్డిని కలిసిన టీడీపీ మహిళా నేత

సూళ్లూరుపేట, జూన్ 6: సూళ్లూరుపేట మండలం కోటపోలూరుకు చెందిన టీడీపీ మహిళా నాయకురాలు ఇసనాక శ్రీవాణి గురువారం సర్వేపల్లి, ఆత్మకూరు ఎమ్మెల్యేలుగా గెలిచిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డిలను కలిసి పుష్పం అందజేసి అభినందనలు తెలిపారు. వైసీపీ కంచుకోట కోటపోలూరులో టీడీపీ అధిక మెజార్టీ వచ్చేందుకు కృషిచేసిన వాణిని సోమిరెడ్డి, ఆనం అభినందించారు. అందుకుముందు ఆమె సత్యవేడు ఎమ్మెల్యేగా ఎన్నికైన కోనేటి ఆదిమూలంను కలిసి అభినందనలు తెలిపారు.

సోమిరెడ్డిని కలిసిన మౌనికారెడ్డి

దక్కిలి, జూన్ 6 : సర్వేపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని దక్కిలి మండలం వెలికల్లుకు చెందిన మౌనికా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు మౌనికారెడ్డి గురువారం నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

వైసీపీని చావుదెబ్బ కొట్టిన పట్టణ ఓటరు

- సూళ్లూరుపేట పట్టణంలో భారీ ఆధిక్యత
- రూరల్ ప్రాంతాల్లో సాధారణ మెజార్టీ

తడ, జూన్6 : వైసీపీ సాగించిన దౌర్జన్యకాండకు పట్టణ ఓటర్లు వైసీపీని కోలుకోలేని చావుదెబ్బ కొట్టారు. ఈ దెబ్బకు వైసీపీ శ్రేణులు బిత్తర పోయాయి. 2014 ఎన్నికల నుంచి సూళ్లూరుపేట నియోజకవర్గంలో వరుసగా వైసీపీ గెలుస్తూ వచ్చింది. మొదటిసారి 3,726 ఓట్ల ఆధిక్యతతో గెలుపు అందుకున్న ఆ పార్టీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య, 2019లో 62,120 ఆధిక్యతతో విజయం సాధించారు. అందులో పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ఆ పార్టీకి మెజార్టీ దక్కింది. ఓజిలిలో 7,947, నాయుడుపేటలో 13,848, పెళ్లకూరులో 8,942, దొరవారిసత్రంలో 9,601, సూళ్లూరుపేటలో 11,235, తడ మండలాలలో 9062 ఓట్ల ఆధిక్యత లభించింది. దీంతో ఆ పార్టీకి తిరుగులేదన్న భావనకు వచ్చేసింది. అప్పటి నుంచి వైసీపీ సాగించిన దౌర్జన్యకాండకు ఓటర్లు బిత్తరపోయారు. గంజాయి విచ్చలవిడి అయిపోయింది. సెటిల్‌మెంట్‌లు నిత్యకృత్యమైపోయాయి. దీంతో పట్టణ ఓటర్లల్లో ఆందోళన కనబడింది. మరో సారి వీరికి అధికారం అప్పజెప్పితే ఏమవు తామో అన్న భయం కలిగింది. ఈ క్రమంలో ప్రస్తుత ఎన్నికల్లో మొత్తం 2,03,421 ఓట్లకుగాను 1,99,715 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో టీడీపీకి 1,11,048 ఓట్లు రాగా, వైసీపీకి 81,933 ఓట్లు దక్కాయి. అయితే రూరల్ ప్రాంతంలో వ్యతిరేకత కల్పించినా ఓట్ల రూపంలో వచ్చేసరికి టీడీపీకి సాధారణ మెజార్టీయే దక్కింది. అందులో ఓజిలి మండలంలో 497, పెళ్లకూరులో 1639, దొరవారిసత్రంలో 2,226, తడ మండలంలో 2,517 ఓట్ల మెజార్టీ మాత్రమే దక్కింది. అయితే పట్టణ ఓటర్లల్లో కలిగిన భయాన్ని ఓటర్లు తమ ఓటు ద్వారా వైసీపీకి చుక్కలు చూపించారు. ముఖ్యంగా సూళ్లూరుపేటలో టీడీపీకి 30,296 మంది ఓట్లు వేయగా, వైసీపీకి 17,217 మంది ఓట్లు వేయడంతో టీడీపీ అభ్యర్థికి ఒక్క సూళ్లూరుపేటలోనే 13,079 ఓట్ల భారీ ఆధిక్యత లభించింది. ఇది సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఏర్పడిన నాటి నుంచి వచ్చిన మెజార్టీలలో అతి పెద్ద మెజార్టీగా చెప్పవచ్చు. కాని నాయుడుపేటలో 8,404 ఓట్ల ఆధిక్యత మాత్రం దక్కింది. ఇలా వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతోపాటు పట్టణాలలో వైసీపీ నాయకుల దౌర్జన్యకాండకు పట్టణ ఓటర్లు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పినట్లు అయ్యింది.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి గెలిపించారు : టీడీపీ

చిల్లకూరు, జూన్ 6: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నమ్మి ప్రజలు కూటమిని అత్యధిక స్థానాలలో గెలిపించారని టీడీపీ సీనియర్ నాయకుడు, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక టీడీపీ నాయకుడు తానంకి నానాజీ నివాసంలో గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు స్థానాల్లో గెలిచిన పాశిం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, కోనేటి ఆదిమూలంతో కలిసి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు కూటమిని గెలిపించారన్నారు. ఈ ఎన్నికల్లో యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు కూటమి అండగా నిలిచారన్నారు. గాడితప్పిన పాలనను అభివృద్ధి పథంలో నడిపించే సత్తా చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. కూటమి సహకారంతో రాష్ట్రాన్ని చంద్రబాబు భివృద్ధిపథంలో నడిపిస్తారన్నారు. అనంతరం గెలిచిన అభ్యర్థులందరూ చంద్రబాబును కలిసేందుకు విజయవాడకు తరలివెళ్లారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, గణపర్తి కిషోర్‌నాయుడు, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, గంటా మధుకృష్ణ, పెనుబోలు జానకిరామిరెడ్డి, తానంకి సతీష్, వెంకటేశ్వర్లునాయుడు, మల్లికార్జున్, నవీన్, వినోద్, కోటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.



విజయవాడకు వెలుతున్న గంగాప్రసాద్, గెలిచిన అభ్యర్థులు

సంపూర్ణ సంక్షేమం, అభివృద్ధే ఎన్డీఏ ధ్యేయం





విజయశ్రీకి స్వీట్ తినిపిస్తున్న మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ శోభారాణి, కేక్ కట్‌చేసి కార్యకర్తలకు తినిపిస్తున్న వెంకటతేజ, కేవీ నాయుడు

నాయుడుపేట, జూన్ 6 : రాష్ట్రంలో, దేశంలో ప్రజలకు సంపూర్ణ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా గెలచిన డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేటలో గురువారం మున్సిపల్ మాజీ చైర్మన్ షైలారి శోభారాణి-రాజశేఖర్ దంపతులు విజయశ్రీకి శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్‌లు అందజేశారు. విజయశ్రీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, అధికారులతోపాటు నాయకులతో సమీక్షించి ఆ మేర అభివృద్ధి పనులను పూర్తిచేసేలా కృషి చేస్తామన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. విజయశ్రీని పలువురు నాయకులు, అభిమానులు, ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

పెళ్లకూరు : సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా డాక్టర్ నెలవల విజయశ్రీ విజయం సాధించడంతో మండలంలోని రావులపాడులో టీడీపీ రైతు విభాగ అధ్యక్షుడు కేవీ నాయుడు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణా సంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం టీడీపీ ప్రవాస భారతీయుడు పేరం వెంకటతేజ, సందీప్‌తేజ కేక్‌కట్ చేసి అందరికి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్యనాయుడు, బాలయ్యనాయుడు, రమేష్‌నాయుడు, రవి, గజేంద్రనాయుడు, మహేష్‌నాయుడు, ఉదయ్‌నాయుడు, నరేంద్రనాయుడు తదితరులు ఉన్నారు.

విజయశ్రీకి అభినందనలు



పెళ్లకూరు, జూన్ 6 : సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన డాక్టర్ నెలవల విజయశ్రీకి మండలంలోని పెన్నేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గాలి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు ఏడుకొండలు, నాయకులు పెంచలయ్య, హర్ష, వెంకటసుబ్బయ్య, వంశీ తదితరు ఉన్నారు.

సోమిరెడ్డికి టీడీపీ నేతల అభినందనలు



పెళ్లకూరు, జూన్ 6 : సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన టీడీపీ రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి పెళ్లకూరు మండల టీడీపీ నేతలు గురువారం కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి పెళ్లకూరు మండలంలో పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, టీడీపీ సీనియర్ నేతలు పేరం రమేష్‌నాయుడు, మధుసూధన్‌నాయుడు, టీడీపీ ప్రవాస భారతీయుడు పేరం వెంకటతేజ, సందీప్‌తేజ, హరినాయుడు తదితరులు ఉన్నారు.

కూటమి నాయకుల సంబరాలు



వాకాడు, జూన్ 6 : టీడీపీ కూటమి గెలిచిన సందర్భంగా గురువారం వాకాడులోని టీడీపీ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డిల ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దోశకాయల కృష్ణమూర్తి, నందగోపాల్‌రెడ్డి, కుంచం దయాకర్, చరణ్‌రెడ్డి, విన్నమాల ద్వారకానాథ్‌రెడ్డి, కళావల్లి ప్రసాద్, బత్తిన ప్రమీల, చిరంజీవమ్మ, గంగాధర్‌రెడ్డి, షేక్ గౌస్‌మోహిద్దీన్, మదర్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల లక్ష్యం 202 కోట్లు

కోట, జూన్ 6 : జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను పొదుపు సంఘాలకు రూ.202 కోట్ల స్త్రీనిధి రుణాల ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్త్రీనిధి రుణాల అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి. హేమంత్‌కుమార్ తెలిపారు. కోటలోని వైఎస్ఆర్ క్రాంతిపథం కార్యాలయంలో గురువారం స్త్రీనిధి రుణాల రికవరీపై సీసీలు, వీవోఏలతో సమీక్ష జరిగింది. ఇప్పటివరకు కోట మండలానికి మంజూరైన స్త్రీనిధి రుణాలు, రికవరీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఆయా సీసీలకు రుణాల రికవరీపై కొన్ని లక్ష్యాలను ఇచ్చారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 162 కోట్లు స్త్రీనిధి రుణలక్ష్యం ఉండగా, 169.3 కోట్లను రుణాలను ఇచ్చామన్నారు. కోట మండలానికి ఈ ఏడాది స్త్రీనిధి రుణాల లక్ష్యం 6.18 కోట్ల రూపాయలు లక్ష్యంగా ఉందన్నారు. సమావేశంలో స్త్రీనిధి మేనేజర్ జయకుమార్, సీసీలు శ్రీకాంత్, భాస్కర్, ప్రసాద్, శంకరయ్య, కృష్ణమ్మ, బిందు, తదితరులు ఉన్నారు.

చెరువుల్లో పడిపోయిన మత్స్యసంపద

41 చెరువుల్లో ఆగిన వేలం పాటలు

కోట, జూన్6: ఈ ఏడాది చెరువుల్లో మత్స్యసంపద (చేపలు) ఉత్పత్తులు బాగా పడిపోయాయి. ప్రతి ఏటా జూన్, జూలై మాసం వరకు చెరువుల్లో అరకొరగా నీరు ఉండటం పరిపాటి. ఈ ఏడాది చెరువుల్లో మత్స్యసంపద జాడే కన్పించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్ర తీర ప్రాంత మండలం అయిన కోటలో 30 నీటి పారుదల, 25 పంచాయతీరాజ్ శాఖకు చెందిన చెరువులున్నాయి. ఆయా చెరువుల కింద వందల నుంచి వేలాది ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ప్రతి ఏటా కురిసే వర్షాలకు ఎగువభాగం నుంచి చేపలు రావడమేకాకుండా సహజసిద్ధంగా ఆయా చెరువుల్లో మత్స్యసంపద భాగా వృద్ధి చెందుతుంది. ఆయా చెరువులను నమ్ముకొని వందలాది కుటుంబాల గిరిజనులు, గిరిజన సొసైటీలు మత్స్యసంపదే ఆధారంగా కుటుంబాలను పోషించుకుంటున్నారు.



కోట మండలం చంద్రశేఖరపురం చెరువు ఎండిపోయి ఉన్న లోతట్టు భాగం

ఈ ఏడాది మేజర్ చెరువులైన పెన్నక్క, అల్లంపాడు, వంజివాక, ఉత్తమనెల్లూరు తదితర గ్రామాల్లోని చెరువుల్లోని నీరు ఇంకిపోయింది. పెన్నక్క చెరువులో మాత్రం నీరు ఉన్నప్పటికి మత్స్యసంపద లేకపోవడంతో గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధార ణంగా చెరువుల్లోని చేపలను పట్టుకునేందుకు పంచాయతీలు వేలంపాటలు నిర్వహిస్తారు. ఈ ఏడాది చెరువుల్లో చేపలు వృద్ధి ఘననీయంగా పడిపోవడంతో చేపల వేలంపాటలు దాదాపు జరగలేదు. ప్రతి ఏటా తెలుగుగంగ 5వ బ్రాంచ్ కెనాల్ నుంచి కోట మండలంలోని పలు చెరువులకు సాగునీరు వదులుతారు. ఈ ఏడాది ఒక్క కేశవరం, కొండుగుంట, రాఘవా పురం చెరువులకు గంగనీరు వదలండంతో మిగతా చెరువులకు నీరు వదల లేదు. దీని కారణంగా కూడా మత్స్యసంపద వృద్ధి చెందలేదని ఆయా గ్రామా ల ప్రజలు, గిరిజనులు చెబుతున్నారు. ఏదీ ఏమైనప్పటికి ఈ ఏడాది చెరువు ల్లోకి మత్స్యసంపద రాకపోవడం, అరకొరగా ఉన్నచేపలు నీళ్లు లేక చని పోవడంతో గిరిజనులు, మండల ప్రజలు ఆశలు ఎండమావిగా మిగిలాయి.